
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 07.10.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 18 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com






# భయపెడుతున్న మున్సి'పల్స్'

## ➤ సర్వేలలో 'దేశం' ఎదురీత! ➤ ప్రత్యక్ష ఎన్నికలైతే గల్లంతే!

రాబోయే ఎన్నికలు ఏకపక్షంగా జరిగిపోవాలి. ప్రతిపక్షం ఉనికే కన పడకూడదు... ఇదే చంద్రబాబు తమ పార్టీ శ్రేణులకు చేస్తున్న ఉపదేశం. మరి ఎన్నికలు ఏకపక్షంగా జరిగేంత సీన్ రాష్ట్రంలో ఏముంది. ఏం అద్భుతాలు చేసాడని ప్రజలంతా కట్టకట్టుకుని తెలుగుదేశంకు ఓట్లేస్తారు. నీతి, నిజాయితీలతో పాటు తమ రాష్ట్రాలను అభివృద్ధి వైపు పరుగులు తీయించిన నరేంద్రమోడీ, నితీష్‌కుమార్, నవీన్ పట్నాయక్, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ల వంటి వాళ్లకే ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించడం సాధ్యం కాలేదు. వారి పరిపాలనతో పోలిస్తే చంద్రబాబుకు వారికి నక్కకు నాగలోకానికి వున్నంత తేడా వుంది.

ఇక్కడ అవినీతి తప్ప అభివృద్ధి ఆనవాళ్లు లేవు. మాటలు కోటలు దాటుతున్నాయేగాని ఆచరణాత్మక ప్రగతికి బాటలు లేవు. మరి ఏం చూసి ప్రజలు చంద్రబాబుకు ఏకపక్షంగా ఓట్లేస్తారు. ఎప్పుడో 2019 ఎన్నికల దాకా ఎందుకు త్వరలోనే రాష్ట్రంలో 7 కార్పొరేషన్‌లకు, పలు మున్సిపాల్టీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. వీటితోనే తెలుగుదేశం బండారం బయటపడబోతోంది. చంద్రబాబు చేతికందిన ఓ నిష్పాక్షిక సర్వేలో (మిగతా 11వ పేజీలో)

## వేడుకగా దసరా సంబరాలు



3లో

## ఫ్యాన్‌కు...
# ఇం'ధనం' కరువు



**2014 ఎన్నికల్లో అధికారం ఖాయమనుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో కూర్చోవడానికి చాలా కారణాలున్నాయి. అందులో ఒకటి ఫైనాన్స్ సబ్జెక్ట్! ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలంటేనే డబ్బుతో కూడుకున్న పని! పార్టీలు, పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల సంఘాలకు చెప్పే లెక్కలకు, పెట్టేఖర్చుకు అసలు పొంతనే ఉండదన్న విషయం ఎన్నికల సంఘం కమిషనర్‌కు కూడా తెలిసే వుంటుంది. ఈమధ్య ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో తనకు వాస్తవంగా ఎంత డబ్బు ఖర్చయ్యిందన్న విషయాన్ని వెల్లడించి స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు చిక్కుల్లో పడడం చూసాం. 2014 ఎన్నికల్లో ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌లో వైకాపాకంటే తెలుగుదేశందే పైచేయి. అభ్యర్థులకు డబ్బులు సమకూర్చడంలో తెలుగుదేశం కోటరీ పక్కా ప్లానింగ్‌తో పనిచేసి సక్సెస్ అయ్యింది.**

2004 నుండి 2014 దాకా తెలుగుదేశం ప్రతిపక్షంలో వుండింది. ఈ పదేళ్ల పాటు పార్టీని నడిపింది చంద్రబాబు సొంత సామాజికవర్గమే! కులం బలం లేకపోతే తెలుగుదేశం పునాదులు కదిలివుండేవి. తన సొంత కులం నుండి ఆర్థిక పరమైన సహకారం లేకే చిరంజీవి కూడా ప్రజారాజ్యం పార్టీని ఆరు నెలలకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ ఆర్థికపరమైన కష్టాలే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని వెంటాడుతున్నాయి. 2014లో ఆర్థిక సర్దుబాట్లు లేనందువల్ల ఆ పార్టీ అభ్యర్థులు కనీసం 10 నుండి 20 స్థానాలలో (మిగతా 11వ పేజీలో)






## ఆక్రమణలు తొలగిస్తే..
# మంత్రి మొనగాడే!

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యాన ఆక్రమణల తొలగింపుపై ఏపి ప్రభుత్వం కూడా కళ్లు తెరిచింది. ఏడాది క్రితం గుర్తించిన ఆక్రమణలను తొలగించాలని తాజాగా రెండోసారి నిర్ణయించింది. ఇటీవల భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ ముంపుకు కారణం కాలువలను ఆక్రమించి పెద్దపెద్ద భవనాలను కట్టడమేనని గుర్తించిన కేసీఆర్ ఆక్రమణలను చాలావరకు కొట్టించాడు. హైదరాబాద్‌లో ఆక్రమణలను కూలగొట్టే సరికి మన ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణలలోనూ కదలిక వచ్చింది. చంద్రబాబు ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలో కాలువల ఆక్రమణల తొలగింపుకు రంగం సిద్ధమైంది.

గత ఏడాది నవంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు నెల్లూరు నగరాన్ని వరదలు ముంచెత్తాయి. నగరంలోని ప్రధాన కాలువలన్నీ (మిగతా 11వ పేజీలో)

# వికలాంగుల ధ్రువపత్రాలకు ఏర్పాట్లు



వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధ్రువ పత్రాలు, బస్సు ప్రయాణ పాస్‌లు పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహా రావు తెలిపారు. మంగళ వారం నెల్లూరు ప్రభుత్వాసు పత్రిలో వికలాంగులకు సర్టిఫికెట్లు జారీ చేసే శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు గతంలో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లుబాటు కానందున కంప్యూటర్ సర్టిఫికెట్లకు ఎక్కువమంది వస్తున్నారన్నారు. ఆధార్‌కార్డు, తెల్లకార్డులతో ప్రభుత్వాసుపత్రిలోనే రిజిస్ట్రేషన్ చేయించి పరీక్షలు చేయిస్తామని తెలిపారు. వంద సర్టిఫికెట్లను వైద్యుల సంతకాలతో పంపిణీ చేశామని, మిగిలిన 600 సర్టిఫికెట్లను పంచాయితీ కార్యదర్శుల ద్వారా నేరుగా వికలాంగులకే అందజేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు ఒట్టూరు సంపత్‌రాజు, డాక్టర్లు కళారాణి, రవికుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖులకు సన్మానం



నెల్లూరు కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీన టౌన్‌హాల్లో నెల్లూరు నగర ప్రముఖులను సన్మానించారు. మూడుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొంది ప్రజాసంక్షేమానికి కృషి చేసిన ఉన్నం బసవయ్య, నటులు, దర్శకులు, రచయిత సి.ఆర్.రాఘవ, నటులు వై.వి.రావులను కిరీటం, శాలువాలతో వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఆచార్య ఆదిత్య, వాస్తు రామచంద్రలు సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటికల్లోని ఘట్టాలను ప్రదర్శించారు. స్వతంత్ర పార్కులో కళావేదికను నిర్మిస్తున్న నెల్లూరు నగరపాలక సంస్థను ముఖ్యఅతిథులు కొనియాడారు. హైటెక్ మెజీషియన్ ఎ.కె.రాయల్ ఇంద్రజాల ప్రదర్శన, బాలాజీ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ట్రస్టు అధ్యక్షులు కేతా సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# వీధికుక్కలను తగ్గిద్దాం...

## - మంత్రి నారాయణ



వీధికుక్కలకు స్టెరిలైజేషన్ చేసి, వాటి సంఖ్యను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వివిధ అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్, డ్వామా, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల గురించి మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లో వీధికుక్కల సంఖ్య తగ్గాలంటే వెంటనే వాటికి స్టెరిలైజేషన్ చేయాలన్నారు. ఈ విషయంపై ఇప్పటికే చాలాసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగిందన్నారు. మునిసిపల్ కమిషనర్లు తగుచర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ గురించి మంత్రి మాట్లాడుతూ దోమలను అరికట్ట డంతో పాటు పారిశుద్ధ్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# సిఎంఆర్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలి

## - జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్



నెల్లూరుజిల్లాలో సిఎంఆర్ రైస్ పంపిణీకి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను నిబంధనల మేరకు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని రైస్‌మిల్లర్లను నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ ఆదేశించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సిఎంఆర్ రైస్ పంపిణీల లక్ష్యాలపై రైస్‌మిల్లర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో జేసీ మాట్లాడుతూ ప్రధానంగా జిల్లాలో నిర్దేశించిన సిఎంఆర్ రైస్ లక్ష్యాలను పెండింగ్‌లో లేకుండా ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సిఎంఆర్ రైస్ లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రక్రియలో డిఎస్ఓ, జిల్లా మేనేజర్ సమన్వయంతో ఏదైనా సమస్యలు వుంటే పరిష్కరించి సిఎంఆర్ రైస్‌ను పూర్తి స్థాయిలో అందించేలా శ్రద్ధ వహించాలన్నారు.

ఈ సమావేశంలో డిఎస్ఓ ధర్మారెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కొండయ్య, వివిధ రైస్‌మిల్లులకు చెందిన ప్రతినిధులు, డిప్యూటీ తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## శబరిమలైకు

# 52 ప్రత్యేక బస్సులు

అయ్యప్ప భక్తుల శబరిమలై యాత్ర కోసం నెల్లూరు రీజియన్ నుంచి ప్రత్యేకంగా 52బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం ఛాంబర్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నెల్లూరు-1 డిపో నుంచి 15, 2 డిపో నుంచి 8, కావలి నుంచి 6, రాపూరు నుంచి 5, ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరు, వెంకటగిరి, వాకాడు, సూళ్లూరుపేట నుంచి 3చొప్పున ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్దె ప్రాతిపదికన ప్రత్యేకబస్సులను భక్తులకు ఇస్తున్నట్లు తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సుకు కి.మీ.కు రూ.45 లెక్కన రోజువారీ అద్దె రూ.18,900లుగా నిర్ణయించామన్నారు. అల్ట్రా డీలక్స్‌ను రూ.18,690, ఎక్స్‌ప్రెస్‌ను రూ.19,740, తెలుగువెలుగును రూ.16,800లకు ఇస్తున్నట్లు తెలిపారు. రోజువారీ అద్దె ప్రాతిపదికన బస్సులను బుక్ చేసిన గురుస్వామి, ఏటిబి ఏజెంట్లకు ఆర్టీసీ నేస్తంలకు రోజుకు రూ.500 చొప్పున కమిషన్ ఇస్తామన్నారు. సీటింగ్ కెపాసిటీ కాకుండా అదనంగా ఇద్దరు వంట మనుషులను అనుమతిస్తామన్నారు. ఒకే బస్సులో 15సీట్లను బుక్ చేసుకున్న వారికి మరోసీటును ఉచితంగా ఇస్తామన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం రవివర్మ, సిటిఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

## కె.వి.సుబ్బారెడ్డి విగ్రహానికి

# స్థలం కేటాయించండి

దివంగత నేత, మాజీఎమ్మెల్యే కె.వి. సుబ్బారెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం నెల్లూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షుడు ఉడతా వెంకట్రావు మాట్లాడుతూ కె.వి.సుబ్బారెడ్డి కాంగ్రెస్‌పార్టీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని, పేదల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. కాంగ్రెస్‌పార్టీ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాల వద్ద ఐల్యాండ్‌లను తొలగించి మిగిలిన విగ్రహాల వద్ద తొలగించకపోవడం దారుణమన్నారు. నెలరోజుల్లో తొలగించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రఘురాం ముదిరాజ్, బాలసుధాకర్ పాల్గొన్నారు.

# మానవీయ మణి మకుటం.. 'గుండె తడి'

*నా దేశం భారత దేశం*
*నా మతం మానవత్వం*
*నా జాతి భారత జాతి*
*నా గుణం స్వదేశం*
*నా కళ్ళు నిర్మల గంగా జలం పుట్టిల్లు*
*నా మస్తిష్కం మమతల నివాసం*
*నా గమనం నిరంతరం*
*నా కర్తవ్యం దేశ రక్షణం!*

అంటూ దేశం పట్ల తన అనురక్తిని విశేషంగా చాటి, నా మతం మానవత్వం అంటూ మానవీయ కోణాన్ని సృశించిన మాన వీయత, దేశభక్తి వెల్లివిరిసిన కవి డా॥ కె.ఎస్.ఎస్.ప్రసాద్‌రెడ్డి. ఆయన కవితా సంపుటి అంతా విలువల కూర్పే. ఆ కూర్పులో కవి గారి నేర్పు సుస్పష్టం.




**గుండెతడి**
పేజీలు : 152 వెల : అమూల్యం
ప్రతులకు: డా॥ కె.ఎస్.ఎస్.ప్రసాద్‌రెడ్డి
ప్లాట్ నెం. 215, నంది నగర్, రోడ్ నెం.14, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
సెల్. 98480 68926

మాటలో వాడి ఉంది, వేడి ఉంది, వెన్న ఉంది, వెలుగు ఉంది మనసు గాయపరుస్తుంది, కొంపలు కూలుస్తుంది. ఊపిరిలూదుతుంది. అందుకే మనిషీ మాట్లాడటం నేర్చుకో మనసు గాయపర్చడం మార్చుకో అంటాడు కవి ప్రసాద్‌రెడ్డి. ఇందో అద్భుతమైన 'మాట'. మాటలో వెన్న ఉంది వేడి ఉంది అని చెప్పడంలో కవి మాట పరమార్థాన్ని గ్రహించాడు. మాట విలువను గుర్తించాడు. అందుకే మాట మార్గాన్ని మనకు ప్రభోదించాడు. మాటతోనే మనిషి బ్రతుకని చెప్పిన మంచి మాటల కవి ప్రసాద్‌రెడ్డి.

'అభ్యర్థన' కవితలో ఓటరూ నువ్వే షూటరు... ప్రజాస్వామ్య భక్షకుల్ని, దేశ ద్రోహుల్ని తుదముట్టించేయ్ అంటారు కవి. అభ్యర్థన పేరుతో ఆయనలోని ఆవేదనల్ని, గుండెతడిని, గుండె గాయాన్ని బయటపెట్టారాయన. ప్రజాస్వామ్య మొక్క వికసించాలని పూలు పూయాలని కోరుకుంటున్నారాయన. దేశద్రోహుల్ని, అవినీతిపరుల్ని తుదముట్టించాలని తల్లి భారతి కంటి నీరు చూడలేని కవి మనస్తత్వంతో మనకు నివేదిస్తున్నారు.

'మానవుడు' కవితలో మనిషి సాధించిన విజయాల పట్ల పొంగిపోతూనే కోపాన్ని, గర్వాన్ని, స్వార్థాన్ని వీడి సంపూర్ణ మానవుడు కాలేకపోయిన వైనాన్ని ప్రశ్నించాడు. మనిషి చిత్రీకరణలో అసంపూర్ణ చిత్రం నోచుకోవడాన్ని నిలువెల్లా ఆగ్రహిస్తున్నాడు కవి కె.ఎస్.ఎస్.ప్రసాద్‌రెడ్డి.

ప్రసాద్‌రెడ్డి గారు గొప్ప మానవతావాది. దీనుల హీనుల పట్ల ఆయనకు అభిమానం ఎనలేనిది. దాదాపు అన్ని కవితల్లో ఆ అభిమానాన్ని సృజించారు. జాతిపిత కలలు పండడమంటే ప్రతి మనిషీ కడుపు పండాలని ఆకాంక్షించారాయన. అందుకోసమే కవనం సృష్టించాలని ఉందంటూ అణువణువునా దేశభక్తి ప్రభోదించిన కవి ప్రసాద్‌రెడ్డి అభినందనీయుడు.

ఉగ్రవాదంపై సమరనాదం విన్పించాడు. అదో ఉన్మాదమన్నాడు. ప్రపంచ మానవజాతి మొత్తం ఏకమైతే నీ సంహారానికి పట్టదు ఒక్క క్షణం అంటూ అది జరుగబోయే క్షణం రానుందని ఆశావహమైన కవిత రాశాడాయన. కవి దార్శనికుడు కావాలి. ఆ దార్శనికత ఈ కవిగారిలో ఉంది.

ప్రతి పువ్వు నవ్వితే వసంతం, ప్రతి గుండె నవ్వితే మానవోత్సవం అంటూ గుండె గుండెల్లో వసంతం చూడాలని మానవోత్సవమే తన జెండాగా తన అజెండాగా కవితా వనంలో విహరిస్తున్న మంచి కవి ప్రసాద్‌రెడ్డి. ఆయన వెలువరించిన 'గుండె తడి' హృదయాల్ని కదిలిస్తుంది. మానవీయతను, దేశభక్తిని ప్రభోదిస్తుంది.

చావంటే భయమెందుకు, చావే రాని బ్రతుకెందుకు అంటూ ఓ సరిక్రొత్త ప్రశ్నను సంధించారు కవి. చావు భయంతో పరుగెత్తే వాళ్ళకిదో గొప్ప హెచ్చరిక. చావే రాని బ్రతుకెందుకనడం ఓ డాక్టరుగా ఆయన సాధించిన మనస్తత్వ విజయం. ప్రసాద్‌రెడ్డి గారు ఇలాంటి వాక్యాలతో గుండె తడిని మరింతగా పరిపుష్టం చేశారు. ఇది అందరూ చదవాల్సిన పుస్తకంగా తీర్చిదిద్దారు. శ్రీ రెడ్డిగారు ఇలాంటి కవితా సంపుటాలు మరిన్ని వెలువరించాలని కోరుకుంటున్నాను. 'గుండె తడి'ని సృష్టించిన ప్రసాద్‌రెడ్డి అభినందనీయుడు.



- చిన్ని నారాయణరావు
94402 02942

## నరసింహకొండ ఇ.ఓగా ఏ.వి.శ్రీనివాసులురెడ్డి



నెల్లూరురూరల్ లోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా అరవభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన నెల్లూరురూరల్ కొండ్లపూడిలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం, వెంకటాచలం మండలంలోని పూడిపర్తి రామలింగేశ్వరస్వామి దేవస్థానాల ఇఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు.

గతంలో నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఇఓగా, తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇఓగా సమర్థవంతంగా పనిచేసి మన్ననలు పొందారు.









# స్వర్ణభారత్ వేదికగా.. 'దీపమ్మ స్వచ్ఛసేవ'

స్వచ్ఛభారత్ లక్ష్యంగా స్వచ్ఛమైన సమాజం ధ్యేయంగా భారత ప్రధాని మోడీ చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ వేదికగా వెంకయ్య ముద్దుల తనయ దీపమ్మ చేపట్టింది. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ఆమె నెల్లూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తమ అక్షర స్కూల్ భాగ స్వామ్యంతో నెల్లూరు మద్రాసు బస్టాండ్ సెంటర్‌లోని ఎ.సి. కూరగాయల మార్కెట్‌ను దీపమ్మ బృందం శుభ్రం చేశారు. ఆమెతో పాటు విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా ఈ శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని వివిధ దుకాణదారులు, అక్కడికి వచ్చిన పౌరులు దీపమ్మని అభినందించారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని జక్కా సుజాతమ్మ క్యాన్సర్ ఆసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దీపా వెంకట్ సంయుక్తంగా నిర్వహించారు. పల్లెపాడులోని గాంధీ ఆశ్రమాన్ని దీపమ్మ సందర్శించి ఆశ్రమ అభివృద్ధికి తన సహాయ సహకారాలను అందిస్తానని చెప్పింది.



అదేరోజు సాయంత్రం జిపిఆర్ కళ్యాణ మండపంలో స్వచ్ఛభారత్ అవగాహనా సదస్సుని దీపమ్మ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగరంలోని వివిధ సంఘాల ప్రతినిధులు, వ్యాపారస్తులు, పలువురు కార్పొరేటర్లు, పురపౌరులు పాల్గొన్నారు. దీపా వెంకట్‌తో పాటు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ సమన్వయకర్త హరగోపాల్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది మాట్లాడారు. "స్వచ్ఛభారత్"ను సమగ్రంగా అమలు చేయాలంటే తీసుకోవలసిన చర్యలు, పాటించవలసిన నియమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ దీపమ్మ ధన్యవాదాలు తెలుపుతూ ఇక్కడ చర్చించిన విషయాలన్నీ పరిశీలించి అటు ప్రభుత్వ పరంగానూ, ఇటు ప్రైవేటు పరంగానూ అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. స్వచ్ఛభారత్ నిర్వహణ కోసం ప్రభుత్వమే అధికారికంగా ఓ కమిటిని వేసి ప్రతి ప్రాంతంలోనూ సమన్వయకర్తలను నియమిస్తే బాగుంటుందని శివప్రభాత్‌రెడ్డి ఇచ్చిన సూచనకు దీపమ్మ సానుకూలంగా స్పందించి అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

## ఔషధ నియంత్రణాధికారి...

# నియంత పోకడ

**• మందులషాపు వ్యాపారుల ఆవేదన**

కేంద్రప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి స్వచ్ఛభారత్ అంటూ ఊదరగొడుతున్నా, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని పదేపదే ప్రచారం చేస్తున్నా.. ఇప్పటికీ ప్రకృతిని ఆస్వాదిస్తూ బహిర్భూమికి వెళ్ళే సంస్కృతి మన వాళ్ళది. అనాదిగా వస్తున్న ఆచారా లని, అలవాట్లని ఇప్పటికిప్పుడు మార్చుకోమంటే మార్చుకోలేని మనస్తత్వాలు మనోళ్ళవి. ఇలాంటి సంప్రదాయాలు పాటించే సమాజంలో రాత్రికి రాత్రే మార్పులు తెచ్చి సంఘ సంస్కర్తలమనే బిరుదు పొందాలని తాపత్రయపడుతుంటారు కొందరు. అలాంటి కొందరిలో ఒక్కడే నెల్లూరుజిల్లా ఔషధ నియంత్రణాధికారి (District Drug Control Officer).

తాను అవినీతి మచ్చలేని నిఖార్సయిన అధికారినని ముక్కు సూటిగా వెళ్ళడం తన విధానమని చెప్పుకుంటూ నియంత పోకడతో మందుల వ్యాపారులకు ఈ అధికారి చిరాకు తెప్పిస్తున్నట్లు సమాచారం. అసిస్టెంట్ డైరెక్టర్‌గా డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఈయన మనిషి మంచోడే కానీ... అంటూ మందులషాపు యజమానులు తమ యాష్టను వెళ్ళగక్కుతున్నారు. ఇలాంటి మంచి అధికారిని మేమిప్పటివరకూ చూడలేదు అంటూనే తమ గోడు విన్నవిస్తున్నారు. చిన్నపాటి తప్పులకు కూడా పెద్దపెద్ద శిక్షలు వేసి మా కడుపు కొడుతున్నా డంటూ వాపోతున్నారు. నియంత్రణాధికారి నియంతలా వ్యవహరించడం సబబుకాదని నికార్సయిన అధికారి ఇలా నిక్కచ్చిగా ప్రవర్తించడం విచారకరమంటూ బాధపడుతున్నారు.

**ఆయనేం చేస్తున్నాడంటే...**

- మందుల దుకాణాలలో పనిచేసేవారు ఖచ్చితంగా యాప్రాన్ (తెల్లకోటు) ధరించాలని ఆదేశిస్తున్నాడు. ఆయన దుకాణాన్ని సందర్శించినప్పుడు తెల్లకోటు వేసుకోకుండా వుంటే కనీసం 10 నుండి 15రోజులు షాపు మూసేస్తున్నాడంట. అంత చిన్న తప్పుకు ఇది అతిపెద్ద శిక్షే.
- పెద్దసైజు దుకాణాలలో ఎక్స్‌పైరీ స్టాక్ కనీస మోతాదులో కనపడ్డా వెంటనే ఆ షాపుని 15రోజులు సీజ్ చేసేస్తున్నాడట. వేలాది మందులు నిలువ వుంచుకునే దుకాణాలలో ఎక్కడో ఒక్క మందు దొరికితే ఇంతపెద్ద శిక్ష వేయడం అన్యాయం అన్నది మందులషాపు యజమానుల ఆవేదన. వారంలో ఒకసారి అన్నీ పరిశీలించుకుని ఎక్స్‌పైరీ మందులను తామే తీసేస్తామని, కానీ ఈలోగానే ఈ అధికారి తమ మీద సవారీ చేస్తున్నాడన్నది వీరి వాదన.
- 5 సంవత్సరాలకోసారి మందులషాపుల లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలి. రెన్యూవల్ సమయంలో షాపు కొలతలు సరిగ్గా వున్నాయా లేదా, షాపు యజమానికి డిఫార్మసి పట్టా వుందా లేదా అన్నది ఖచ్చితంగా గమనించాలి. అయితే షాపుకు సంబంధించిన లీజు అగ్రిమెంటు కూడా ఈ అధికారి జత చేయమనడంతో షాపు నిర్వాహకులకు భవన యజమానులతో పెద్ద సమస్య ఎదురౌతుంది. అప్పటి వరకూ 10వేలో లేక 5వేలో వున్న బాడుగను భవన యజమానులు ఒక్కసారిగా పెంచేస్తున్నారు. లీజు అగ్రిమెంటు లేకపోతే లైసెన్సు రెన్యూవల్ కాదన్న సాకుని అడ్డం పెట్టుకుని భవన యజమానులు షాపు నిర్వాహకులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ పరిస్థితికి కూడా ఈ అధికారే కారణం కావడం గమనార్హం.
- మందుల చీటీ లేకుండా మందులు అమ్మడానికి లేదనడం మంచిదే కావచ్చు కానీ ఆచరణలో ఇది అసాధ్యమైన విషయం. దీర్ఘకాల రోగాలతో బాధపడే ఎంతోమంది గ్రామీణ ప్రాంతవాసులు నిరక్షరాస్యులు తమ వద్ద వున్న పాత మందులనే శాంపిల్‌గా తీసుకెళ్ళి మళ్ళీ అవే మందులు కొనుగోలు చేస్తుంటారు. వెళ్ళిన ప్రతిసారీ మందుల చీటీ చూపించాలంటే వాళ్ళకి చాలా కష్టం.

తప్పు నిజంగా జరిగితే తప్పు చేసినవారికి భారీ జరిమానా విధించినా ఫరవాలేదు కాని, ఇలా రోజుల తరబడి మందుల షాపులను మూసేయించడం సమంజసం కాదు. పెద్దపెద్ద నిరసనలు బంద్‌లు జరిగే సమయాల్లో కూడా మందులషాపులకు మినహాయింపు వుంటుంది. అలాంటిది ఈ అధికారి వారాల తరబడి షాపులను మూయించడం ఆయన నిరంకుశ పోకడకు అద్దం పడుతుందని దుకాణదారులు ఆవేదన చెందుతున్నారు.

రూల్ ఈజ్ రూల్ అంటూ తనను తాను భుజం తట్టుకుంటూ పనిచేస్తున్న ఈ అధికారి పొగతోటలో ఆసుపత్రులకు అనుబంధంగా వున్న మందులషాపుల జోలికి అస్సలు వెళ్లడం లేదు. ఎక్కువగా శాంపిల్స్ దొరికేది ఆ షాపుల్లోనే. అయితే ఆసుపత్రి నిర్వాహకుల పరపతి ఏ స్థాయిలో వుంటుందోనన్న భయంతో ఈయన వారి జోలికి మాత్రం పోవడం లేదు. వారిని నియంత్రించడంలో తన నియంత పోకడని చూపించడం లేదు. రూల్ ఎవరికైనా రూలే సార్...

మహానగరాలలో సైతం లేని అలవాట్లను నెల్లూరులాంటి ప్రదేశాల్లో అమలు చేయాలంటే కష్టమే. మీ నిజాయితీని నిబద్ధతలను ప్రదర్శించుకోవడానికి సామాన్య షాపు యజమానులను ఇబ్బంది పెట్టడం సబబు కాదు. నెల్లూరులో అక్రమాల నిలయాలుగా వున్న ఎన్నో కార్పొరేట్ ఆసుపత్రులకు అనుబంధంగా మందుల దుకాణాలున్నాయి. ఆ దుకాణాలపై దాడి చేసే ధైర్యం దమ్ము మీకుందా..? అని మందులషాపు యజమానులు ప్రశ్నిస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి...? ఒక్కసారి ఆలోచించుకోండి మన చేతిలో అధికారం వుంది కదా అని కామన్‌మేన్‌ని ఇబ్బంది పెట్టి, కార్పొరేట్ రంగాన్ని వదిలిపెట్టడం నిజాయితీ అనిపించుకోదు.

దొంగ మందులను, ఎక్స్‌పైరీ మందులను నియంత్రించే బాధ్యతే మీది కాని, ఇలా నియంతలా వ్యవహరించడం ఎంతవరకు న్యాయమో మీరే ఆలోచించుకోవాలి...?

## సంబరంగా దసరా...

# వాడవాడలా వేడుకలు



అమ్మవారి శరన్నవరాత్రులను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని దేవతాలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పండుగ వేడుకల్లో భాగంగా అన్ని దేవాలయాల్లో వివిధ అవతారాలతో అమ్మని కొలవడంతో పాటు ఒక్కొక్కరోజు ఒకొక్క విశేష అలంకారంతో పూజలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని అమ్మ ఆలయాలలోనూ భక్తులు వేలసంఖ్యలో పాల్గొని జగన్మాతని ప్రసన్నం చేసుకుంటున్నారు.

ఈ వేడుకలతో పాటు అధికసంఖ్యలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా కొన్ని ప్రముఖ దేవాలయాలలో నిత్యం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 3వ తేదీ దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రముఖ నాట్యాచార్యుడు, కీర్తిశేషులు వేంపటి చినసత్యం కుమారుడు వేంపటి రవిశంకర్ నిర్వహించిన నాట్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కొన్ని దశాబ్దాల తరువాత వేంపటి చినసత్యం బృందం నెల్లూరుకు రావడంతో అమ్మవారి భక్తులతో పాటు కళాప్రియులు, కళారాధకులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేంపటి రవిశంకర్ కూచిపూడి అకాడమి ఆధ్వర్యంలో అనంత్ కళాంజలి సారథ్యంలో జరిగిన ఈ సాంస్కృతిక సంబరంలో బృందంలోని అందరూ బయట రాష్ట్రాల వారు కాగా ఒక్క చిన్నారి మాత్రం మన నెల్లూరీయురాలు కావడం విశేషం. శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మమతల కుమార్తె నిరీష ఈ బృందంలో ఒకరిగా తన నృత్యప్రదర్శనలో అందరినీ ఆకట్టుకుంది. అమెరికాలో పుట్టి పెరిగి, మన సంస్కృతి, సంప్రదాయంతో పాటు భారతీయ కళలపై మక్కువతో వేంపటి రవిశంకర్ వద్ద శిష్యరికం చేసింది నిరీష. దాదాపు రెండు గంటల పాటు వేంపటి బృందం నిర్వహించి ప్రదర్శన ఆద్యంతం అందరినీ అలరించింది. కార్యక్రమ అనంతరం రవిశంకర్ బృందాన్ని శాలువాలతోను జ్ఞాపికలతోనూ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి భక్త మండలి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ఆలయ ఈవో కోదండరామిరెడ్డి సత్కరించారు. ఇంత చక్కని కార్యక్రమాన్ని నెల్లూరీయులకు అందించిన రవి సన్నారెడ్డిని అమ్మవారి ఆలయం పక్షాన గౌరవించారు. అమెరికాలో పుట్టినా మన సంస్కృతిని సంప్రదాయాన్ని మరువకుండా భుజాలపై మోస్తున్న నిరీషకు 'లాయర్' అభినందనలు.



## 'ప్రభా'తం

సరిహద్దుల్లో కల్లోలం.. ఉగ్రతండాలతో దేశంలో పలుచోట్ల విధ్వంసాలు, మారణకాండలు.. పఠాన్‌కోట్ స్థావరంపై ఉగ్రవాదుల దాడులు, అందమైన కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తూ ప్రజాజీవితాన్ని ఛిన్నాభిన్నం చేయడం.. ఉరీలో ఏకంగా సైనిక స్థావరంపైనే విరుచుకుపడి 18 మంది సైనికులను మంటలకు ఆహుతి చేయడం..ఇలా లెక్కపెట్టుకుంటూపోతే పాక్ కేంద్రంగా తిష్టవేసుకుని కూర్చునివున్న ఉగ్రవాద పిశాచులు చేస్తున్న దౌష్ట్యాలకు, క్రౌర్యాలకు.. దారుణ మారణకాండలకు అంతూ పొంతూ వుండడం లేదు. ఎప్పుడూ గుంటకాడ నక్కలా నక్కి వుండడమే.. అదనుచూసి భారత్‌పై దాడులు చేయడమే.. ఇదే పనైపోయింది పాక్ ప్రేరేపిత ఉగ్రవాద తండాలకు.

అయినా, ఇలా ఎంతకాలం? ఇంకా ఎన్నాళ్లు.. ఎన్నేళ్ళు... ఈ హింసలను భరాయించడం? దేశ సరిహద్దులను కాపాడే వీరజవాన్‌లు సైతం ఉగ్రదాడుల్లో మరణిస్తుంటే ఎంతకాలం గుడ్లప్పగించి చూస్తూండడం?. . భారత్‌పై పాక్ చేస్తున్న ఈ ఆగడాలకు, అకృత్యాలకు అంతే లేదా?.. వీటికి తగు గుణపాఠం చెప్పేవారే లేరా?... అనుకుంటున్న సమయంలో, వీటన్నింటికీ ఒకే జవాబు.. భారత ప్రధాని నరేంద్రమోదీ సంధించిన వజ్రాయుధం.. 'సర్జికల్ స్ట్రైక్స్'. శాంతియుతంగా వున్న భారత్‌పై పాక్ పదేపదే చేస్తున్న ఉగ్రదాడులకు ఒకే ఒక పిడిగుద్దు అది. భారత వీరజవాన్లు కొట్టిన ఆ దెబ్బతో దిమ్మ దిరిగిన పాక్.. అబ్బే అలాంటివేమీ మామీద జరగ లేదంటూ బుకాయించడం.. అది దాని నైజం. అయినా, పాక్ ఉగ్రవాదులు నేటికీ కశ్మీర్‌ను అగ్నిగుండంగా మార్చి అక్కడి ప్రజల జీవితాలతో చెలగాట మాడుతూనే వున్నారు.

భారతదేశం శాంతికి పతాక అని, యుద్ధానికి కాలుదువ్వదని తెలిసీ.. భారత్ అనేకసార్లు ఆదరంతో స్నేహహస్తం చాచినా చేయందించక.. ఉగ్రమూకలతో భారత్‌ను మరింతగా రెచ్చగొడుతున్న పాక్‌కు ఇకనైనా గుణపాఠం చెప్పకపోతే..భారత్ చెప్పేవన్నీ మాటలే తప్ప చేతలు లేవనే అపప్రద ఎదురు కాదా?.. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదంపై పోరుకు అన్నిదేశాలూ సమాయత్తం కావాలని మోదీ తన ప్రసంగాల్లో పదే పదే చెప్తూ, చివరికి తమ దేశంమీదనే ఉగ్రవాదులు దాడులు చేస్తున్నా ఏమీచేయలేని..ఉగ్రవాదంపై పోరు చేయలేని అసహాయస్థితిలో వుంటే ఎంత అప్రదిష్ట?..అందుకే, భారత్ అంటే ఏమిటో, భారత సైనికుల సత్తా ఏమిటో ఒకసారి పాక్‌కు రుచి చూపించారు ప్రధాని మోదీ. అయినా, తమ లక్ష్యం ఉగ్రవాద స్థావరాలే తప్ప, పాక్ భూభాగాలు కానీ, పాక్ సైన్యం కానీ కాదని భారత ప్రభుత్వం స్పష్టం చేయడం భారత్ లక్ష్యశుద్ధికి.. చిత్తశుద్ధికి నిదర్శనం.

ఏళ్ళ తరబడిగా పాక్ ఉగ్రవాదాన్ని భారత్ సహిస్తూ వచ్చింది. అయితే, ఒక్క భారత్‌లోనే కాకుండా ప్రపంచమంతటా పాక్ ఉగ్రకోరలు విస్తరిస్తుండడం, ఉగ్రవాదులకు పాక్‌లో శిక్షణ ఇస్తుండడం, ఇతర దేశాల్లో విధ్వంసాలు సృష్టించివస్తున్న ఉగ్రవాద ముష్కరులకు పాక్ ఆశ్రయమిచ్చి ప్రోత్సహిస్తుండడం ప్రపంచానికంతటికీ తెలిసిందే. అమెరికాలో భారీ విధ్వంసం సృష్టించిన ఆల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ నాయకుడు బిన్‌లాడెన్‌కే పాక్ ఆశ్రయం కల్పించిందని తెలిసి అప్పట్లో అమెరికా సైతం పాక్ ఉగ్రచర్యలకు విస్తుపోయింది. నేటికీ ప్రపంచంలో అనేకచోట్ల ఉగ్రవాద తండాలు పేట్రేగిపోయి అమాయకులను పొట్టన బెట్టుకుంటూనే వున్నాయి. ముంబైలో తాజ్ హోటల్‌పై దాడులు, ఇంకా అనేకచోట్ల జరిగిన మారణ కాండలు..అన్నీ పాక్ కుట్రల పుట్టలోంచి వచ్చినవే. అయినా, ఉగ్రవాద విషసర్పం కోరలు పీకేందుకు కాదు కదా..తాకేందుకు కూడా ఎవరూ సాహసించే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో, అది మరింత చెలరేగిపోతూ కాలనాగులా కనిపించినవారందరినీ కాటేసే స్థితికి వచ్చేసింది. ఇటీవల ఉరీలోని సైనికస్థావరంపై దాడులకు పాల్పడి 18 మంది సైనికుల సజీవ దహనానికి కారణమైంది. ఆ వీరజవాన్ల మరణంతో ఒక్క భారతదేశమే కాదు.. ప్రపంచమే తల్లడిల్లింది. అందుకే, ఉగ్రవాదదేశంగా మారిన పాక్ ను ఏకాకిని చేయడం ద్వారా పాక్ కుయుక్తులను లోకానికి చాటాల్సివుంది. అందుకు దౌత్యపరంగా తీసుకోవాల్సిన అన్నిరకాల చర్యలనూ తక్షణం తీసుకోవాల్సి వుంది. అంతేకాదు, ఉగ్రవాదా నికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలూ సమాయత్తమై ఉగ్రవాదాన్ని సమూలంగా తుడిచి పెట్టాల్సిన తరుణం కూడా ఇదే.

ఏదేమైనా, మారణహోమాలే లక్ష్యంగా, పైశాచి కత్వంతో విర్రవీగుతున్న ఉగ్రవాదులను ఇంకా ఇంకా ఉపేక్షిస్తే..భారత్‌కు మరింత నష్టం జరుగుతుందని ప్రజలు భయపడుతున్న తరుణంలో..మోదీ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. సర్జికల్ స్ట్రైక్స్‌తో తగు గుణపాఠం చెప్పారు.

పాక్ ఎంతగా కుయుక్తులు ప్రదర్శిస్తున్నా, పొరుగుదేశం కనుక మోదీ ఆ దేశంపై తొలుత స్నేహహస్తమే చాచారన్నది అందరికీ తెలిసిందే. మోదీ ప్రధాని పదవిని అధిష్టించే రోజునే ప్రమాణస్వీకా రోత్సవానికి పాక్ ప్రధానిని ఆహ్వానించడం, పాక్ ప్రధాని పుట్టిన రోజున లాహోర్‌కు వెళ్ళి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పడం, నవాజ్‌షరీఫ్ మాతృమూర్తి ఆశీర్వాదాన్ని కూడా తీసుకోవడం.. ఇలా ఎంతో అభిమానంతో భారత్ స్నేహహస్తం అందించినా.. ఎంతటి సమస్యలనైనా చర్చల ద్వారా పరిష్కరించుకుందామని మోదీ పాక్‌కు అనేకసార్లు చెప్పినా.. పాక్ మాత్రం తన బుద్ధి ఏమాత్రం మార్చుకోలేదు. అయినా, భారత్‌కు ఎప్పుడూ యుద్ధకాంక్ష లేదు.

భారత్ శాంతిని ప్రేమిస్తే, పాక్ హింసను ప్రేమిస్తోంది. అలాంటి దుష్టబుద్ధికి తగు గుణపాఠం చెప్పడం ద్వారా మోదీ ప్రభుత్వం భారత్ ప్రతిష్టను నిలబెట్టినందుకు ఎవరైనాసరే అభినందించాల్సిందే. యావద్భారతదేశమే కాదు.. ప్రపంచదేశాల ప్రజలంతా మోదీ నిర్ణయానికి ఆనందిస్తున్నారు. అభినందిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఉగ్రదాడులకు ధీటైన సమాధానం చెప్తూ.. తమ అత్యద్భుత సాహసాన్ని ప్రదర్శించిన మన వీరసైనికులకు మనసారా అభినందనలు.



### ఉగ్రవాదంపై వరల్డ్‌వార్

భారత్ స్నేహహస్తం అందించినా.. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని అనేకసార్లు చెప్పినా.. పాక్ తన బుద్ధి మార్చుకో లేదు. భారత్‌పై పదే పదే ఉగ్రదాడులకు పాల్పడుతూనే వుంది. పఠాన్‌కోట, ఉరీ సైనికస్థావరాల్లో విధ్వంసాలు సృష్టించింది. అందుకు సర్జికల్ స్ట్రైక్స్‌తో బలంగా బదులివ్వడం ద్వారా మోదీ భారత ప్రతిష్ట నిలిపారు. భారత సైనికశక్తి ఏమిటో మన సైనికులు పాక్‌కు రుచి చూపించారు. దుష్టబుద్ధికి తగు గుణపాఠం చెప్పి భారత ప్రధాని మోదీ అందరి ప్రశంసలు అందుకున్నారు.

## ఆప్కో బట్టలపై డిస్కౌంట్

దసరా సందర్భంగా నెల్లూరు, ఏసి సెంటర్‌లోని ఆప్కో వస్త్రాలయంలో 50శాతం డిస్కౌంట్‌తో ఆప్కో వస్త్రాలను అమ్ముతున్నట్లు ఆప్కో డివిజన్ మార్కెటింగ్ అధికారి జగదీశ్వర్ తెలిపారు. ఆప్కో వస్త్రాలయంతో పాటు జిల్లా కోర్టు వద్ద వున్న ద్వాక్రా భవనంలోని వస్త్రాలయం-2లోనూ, గూడూరు, శ్రీహరికోటలలో వున్న తమ కేంద్రాల లోనూ ఈ డిస్కౌంట్‌తో వస్త్రాలను అమ్ముతున్నామని, పోచంపల్లి, గద్వాల్, వెంకటగిరి, మంగళగిరి, బెనారస్‌ల చీరలు లభిస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జడ్పీ స్టాండింగ్ కమిటీల సమావేశాలు

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 15వ తేదీ ఉదయం 10గంటల నుండి జరుగనున్నాయి. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలను అదేరోజు జరుపనున్నాయి.

## కంప్యూటర్ బోధకుల పోస్టులకు దరఖాస్తులు

నెల్లూరు హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించేందుకు కంప్యూటర్ బోధకులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం కన్వీనర్ ఎం.వి.చలపతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అనుభవం, నైపుణ్యం ఆధారంగా జీతం ఇస్తామన్నారు. ఎంఎస్ ఆఫీసు, డిటిపి, ఇంటర్నెట్ తదితర కోర్సులు నేర్పించేందుకు ఆసక్తి కలిగినవారు drjsmt@gmail.comకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 94903 00906, 9000450862 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ
## అభ్యర్థుల దరఖాస్తులకు ఆహ్వానం

ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బిసి కార్పొరేషన్ రుణాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్-2 రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జేసి-2 ఛాంబర్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 2013-14 ఆర్థిక సంవత్సరంలో రుణాలు పొందనివారు ఈ నెల 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తు చేసుకుని రుణాలు మంజూరు కాని అభ్యర్థులు మళ్ళీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. 21 నుంచి 50ఏళ్ళ లోపు వయస్సు కలిగి తెల్లరేషన్ కార్డు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఇ.డి బి.వెంకటస్వామి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఇ.డిలు జయరామ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజుకు విశిష్ట సేవా పురస్కారం

చిత్తూరుజిల్లా వి.కోటలోని పిఎంఆర్ కళ్యాణ మండపంలో కళాభారతి ఫౌండేషన్, రేవతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 1వ తేదీ జాతీయ తెలుగు కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొని తమ కవితలను వినిపించారు. నెల్లూరుజిల్లాకు చెందిన యువకవి కె.మురళీమోహన్‌రాజు గత పదేళ్లుగా చేస్తున్న సాహిత్య, సాంస్కృతిక సేవలకు గాను విశిష్ట సేవాపురస్కారాన్ని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి, ద్రావిడ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య కంకణాల రత్నయ్య, యాక్ట్స్ సంస్థ అధినేత దశరథరామిరెడ్డి తదితరులు రాజును అభినందించారు.






## మోదీ శ్రమ ఫలితమే ఇదంతా!

ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ దేశాలలో పర్యటిస్తుంటే ఎన్నో విమర్శలు చేసారు. దేశ పరిపాలనను గాలికొదిలేసారన్నారు. కాని ఆయన విదేశీ పర్యటనల ఫలితమే ఈరోజు పాకిస్థాన్ పై పోరు విషయంలో అన్ని దేశాలు మనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. పాక్‌లో తలపెట్టిన సార్క్ సదస్సును మనతో పాటు ఐదు దేశాలు బహిష్కరించాయంటే అది మోదీ దౌత్యవిజయమే! గతంలో మనకు సార్క్ దేశాలతోనూ సత్సంబంధాలుండేవి కావు. మోదీ ప్రధాని అయ్యాకే ఆ దేశాలతో మెరుగైన సంబంధాలకు కృషి చేసారు. అంతే కాదు, ఒక్క చైనాను తప్ప అగ్రదేశాలన్నింటిని కూడా మనకు మద్దతుదారులుగా మలచగలిగారు. పాకిస్తాన్‌ను ఒక పనికిమాలిన బాధ్యతారాహిత్య దేశంగా ప్రపంచ దేశాల ముందు నిలబెట్టడంలో మోదీ చేసిన కృషి ఫలించిందనే చెప్పవచ్చు.

**- జి.ఎస్.రెడ్డి, హైదరాబాద్.**

## వెర్రి తలకెక్కిందా?

ప్రత్యేకహోదా ఉద్యమాలలో పాల్గొంటే పి.డి యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తామని ముఖ్యమంత్రి స్థాయిలో చంద్రబాబు బెదిరించడం సిగ్గుచేటు. నిరసన తెలిపే హక్కు అందరికీ వుంది. నిరసన ముసుగులో నేరాలకు పాల్పడితే అప్పుడు కేసులు పెట్టి శిక్షించండి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఆందోళనలు చేయలేదా? మరి అప్పుడు అధికారపక్షం ఆయనపై పి.డి యాక్ట్ క్రింద కేసులు పెట్టుంటే ఆయన పరిస్థితి ఏంటి?

**- ఎం.బాలకృష్ణ, నెల్లూరు.**

## తెల్లకార్డుల ఖజానా!

నిత్యం పత్రికలలో వినపడే స్వరం జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్. ఆయనంటే నాకు వల్లమాలిన అభిమానం. పేదరికం నుండి వచ్చిన వాడు. వారి పారదర్శక పనితీరు ఎంతో బాగుంటుంది. నీతికి నిలువుటద్దం అంటారు. బోగస్ తెల్ల కార్డుల ఏరివేతలో ఆయన చొరవ అభినందనీయం.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# సత్ప్రవర్తనతోనే స్వచ్ఛ సమాజం

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**




సత్ప్రవర్తన, సచ్ఛీలతతోనే స్వచ్ఛమైన సమాజం నిర్మాణమవుతుందని విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన నెల్లూరులోని సెంట్రల్ జైలులో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం గాంధీ జయంతి రోజున ఆయన నెల్లూరు కేంద్ర కారాగారంలో ఖైదీల శ్రేయస్సు, ఆరోగ్యం కోసం అనేక సదుపాయాలు కల్పిస్తుంటారు. ఈ ఏడాది కూడా ఈ జైలుకు ఐదు కంప్యూటర్‌లను, ఒక రెండు టన్నుల ఏసిని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ మంచి విలువలు, మంచి నడవడిక కలిగినందువల్ల మన జీవితమే అద్భుతంగా మారుతుందన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ద్వారా పేద పిల్లలకు ఉచిత విద్య, పేద ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, ప్రజల ఆశీస్సులతోనే ఈ సేవాయజ్ఞాన్ని చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ పుట్టగానే ఎవరూ ఖైదీలు కారని, కాని ఖైదీలు మంచి మనుషులుగా, మానవతావాదులుగా మారడానికి వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోకూడదని అన్నారు. ఈ జైలులో 52మంది ఖైదీలు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పరీక్షలకు హాజరు కావడాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా, సీనియర్ సివిల్ జడ్జి పి.సత్యవాణి, జైలు సూపరింటెండెంట్ ఎం.రవికిరణ్, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్ధమవుతున్న...

# ఎమ్మెల్సీ రేసుగుర్రాలు

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నెల్లూరుజిల్లా స్థానిక శాసన మండలి నియోజకవర్గాలతో పాటు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. 2011లో ఈ మూడు నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో స్థానిక సంస్థల నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా వాకాటి నారాయణరెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గం నుండి యండ్రపల్లి శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి విఠపు బాలసుబ్రహ్మణ్యం వామపక్షాలు బలపరచిన అభ్యర్థులుగా గెలిచారు.

ఈసారి రాష్ట్రంలోనే కాకుండా జిల్లాలోనూ రాజకీయాలు సమూలంగా మారాయి. తెలుగుదేశంపార్టీ అధికారంలో వుంది. ఈ మూడు స్థానాల మీద కన్నేసి తదనుగుణంగా పావులు కదుపుతోంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలుగుదేశం నుండి ఎవరిని బరిలోకి దింపినా సులభంగా గెలవచ్చు. ఒకవేళ వైకాపా పోటీ అభ్యర్థిని దించితే ఇరు వైపులా డబ్బు ఖర్చు పెరుగుతుంది. కాని మొగ్గు మాత్రం తెలుగుదేశం వైపే ఉంటుంది. ఈ ఉద్దేశ్యంతోనే స్థానిక సంస్థల శాసనమండలి అభ్యర్థిత్వం కోసం తెలుగుదేశం నుండి చాలామందే పోరాడుతున్నారు. వారిలో మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతో పాటు ప్రస్తుత ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. వాకాటికి ఇచ్చే ఛాన్స్ లేదు. గత ఎన్నికల్లో పార్లమెంట్‌కు గట్టి పోటీ ఇచ్చి ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాత్రం ఈ సీటు కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆనం రామనారాయణరెడ్డి మాత్రం చంద్రబాబు ఆదేశిస్తే దిగుతాడు గాని, తనంతటతాను తనకుగాని, తన కుటుంబసభ్యులకు గాని ఈ సీటు కావాలని కోరే ప్రయత్నం చేయకపోవచ్చు. మిగిలినవాళ్లు కూడా చంద్రబాబు కరుణిస్తే అవకాశం వస్తుందని ఎదురుచూస్తున్న వాళ్లే! రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం (నెల్లూరు, ప్రకాశం, చిత్తూరుజిల్లాలు) సీటును మాత్రం మంత్రి పి.నారాయణ అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ఆశిస్తున్నాడని, మంత్రి అతనికి లైన్ క్లియర్ చేసాడని కూడా సమాచారం. ఇటీవలకాలంలో చంద్రబాబు తెలుగుదేశం అనుబంధ ఉపాధ్యాయ సంఘం పటిష్టతపై కూడా దృష్టి సారించాడు. ఉపాధ్యాయ సంఘాలలో వామపక్ష సంఘాలదే పైచేయి. ఈసారి ఎలాగైనా తమ పార్టీ అనుబంధ సంఘాలను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఈ దిశగా ఈ నియోజకవర్గం నుండి కూడా ఆయన గట్టి అభ్యర్థుల్నే రంగంలోకి దించవచ్చు. ఫిబ్రవరిలో జరిగే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చంద్రబాబు ఇప్పటి నుండే యాక్షన్ ప్లాన్‌ను తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# క్రీడాకారులకు స'పోర్ట్'

**కృష్ణపట్నం పోర్టును సందర్శించిన ఒలింపిక్స్ రజత పతక విజేత సింధు**



భారత దేశానికి పతకాలతో పాటూ కీర్తిప్రతిష్టలు తెచ్చే క్రీడాకారులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని చాటిచెబుతూ నెల్లూరులోని కృష్ణపట్నంపోర్టు యాజమాన్యం రియో ఒలింపిక్స్ రజత పతక విజేత పి.వి.సింధును తమ పోర్టుకు ఆహ్వానించి, ఘనంగా సన్మానించింది. ఈ నెల 2, 3తేదీలలో పి.వి.సింధుతో పాటూ ఆమె కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్, అమ్మా, నాన్నలు విజయ, పి.వి.రమణ, సోదరి దివ్యలు కృష్ణపట్నం పోర్టులో గడిపారు. బెంగుళూరు నుండి పోర్టు హెలికాప్టర్ ద్వారా 2వ తేదీ ఇక్కడకు వచ్చారు. కృష్ణపట్నం పోర్టు ప్రగతిని వీక్షించారు. కృష్ణపట్నం సెక్యూరిటీ అకాడమీలో భద్రతా సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. డాగ్‌స్క్వాడ్ విన్యాసాలను పరిశీలించారు. పోర్టు పరిపాలనా కార్యాలయంలో గత 8ఏళ్లలో పోర్టు సాధించిన ప్రగతిని వీడియో ప్రజంటేషన్ ద్వారా తిలకించారు. ఇక్కడ పోర్టు యం.డి చింతా శశిధర్, పోర్టు సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. గ్రీన్‌పోర్ట్ లక్ష్యంగా చేపట్టిన కోటి మొక్కల ఉద్యమంలో భాగంగా పోర్టు పరిధిలో సింధూర వనం పేరుతో ఒక పార్క్‌ను ఏర్పాటు చేసి పి.వి.సింధు చేత మొదటి మొక్కను నాటించారు. యం.డి చింతా శశిధర్ సింధుకు వెండి షటిల్ రాకెట్‌ను బహుమతిగా అందించారు. 2వ తేదీ అక్కడే బస చేసిన సింధు పరివారం 3వ తేదీ ఉదయం సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడిచే తూర్పుకనుపూరులోని 'నవనీత' స్కూల్‌కు చేరుకున్నారు. సింధుకు విద్యార్థులు పూలతో స్వాగతం పలికారు. ఇక్కడ సింధు విద్యార్థులతో ఎంతో సరదాగా గడిపారు. చదువుకు సంబంధించిన విషయాలపై వారితో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. నవనీత పబ్లిక్ స్కూల్ ఇక్కడి విద్యార్థులకు వరంలాంటిదని, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ఈ స్కూల్‌ను ఏర్పాటు చేసి పేద పిల్లలకు ఉచిత విద్యనందించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని ఈ సందర్భంగా సింధు పేర్కొన్నారు. స్కూల్‌లో ప్రయోగశాలలను, వసతిగృహాలను, క్లాస్‌రూమ్‌లను సింధు పరిశీలించారు.



ఈ కార్యక్రమాలలో పోర్టు యం.డి చింతా శశిధర్, ఆయన సతీమణి ప్రియ, కొడుకు విశ్వ, పోర్టు సిఇఓ అనిల్ ఎండ్లూరి, పోర్టు పిఆర్ హెడ్ గంటా వేణుగోపాల్, సెక్యూరిటి చీఫ్ రాజేంద్రప్రసాద్, డిఇఓ మువ్వా రామలింగం, గూడూరు డీఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, గూడూరు రూరల్ సి.ఐ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈరోజు దేశంలోనే పెద్ద సెలబ్రిటి, క్రీడాకారిణి సింధు తమతో గడపడంతో నవనీత స్కూల్ విద్యార్థులు మధురానుభూతికి లోనయ్యారు.

# వైయస్సార్ ఇళ్లను పరిశీలించిన మంత్రి



మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ 3వ తేదీ నెల్లూరు వైయస్సార్ నగర్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కూలిన ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులకు కేటాయించిన ఇళ్లపైకి ఎక్కి అవి ఎంత నాణ్యతగా వున్నాయో పరిశీలించారు. రానున్న 18 నెలల్లో ఈ ప్రాంతంలోని ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నగరంలో ఇంకా ఇళ్లు లేనివారికి కూడా ఇక్కడే ఇళ్లు కేటాయింపులు జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ ముత్యాలరాజు, హౌసింగ్ పి.డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

## రొట్టెల పండక్కి ముస్తాబు

ప్రతిఏటా ఎంతో వైభవంగా నిర్వహించే రొట్టెల పండుగకు నెల్లూరు దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా ముస్తాబైంది. ఈనెల 12 నుండి 16వ తేదీ వరకు రొట్టెల పండుగ జరుగనుంది. తెలుగు రాష్ట్రాల నుండే కాక, ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల నుండి కూడా పెద్దఎత్తున భక్తులు ఇక్కడకు వస్తుంటారు. ఈసారి 4కోట్ల ఖర్చుతో స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు పట్టేందుకు అనువుగా ఘాట్‌లు నిర్మిస్తున్నారు. అలాగే ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు.

## బిజిఆర్ కళాశాలలో గాంధీ జయంతి




నెల్లూరు దర్గామిట్టలోని డా॥ బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు 'పర్యావరణం - గాంధీజీ అభిప్రాయం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, పద్య పఠనం పోటీలు నిర్వహించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి తన కుమారుడు స్వర్గీయ జక్కా హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కబడ్డీకి ఎంఎస్ఆర్ జట్టు

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మాగుంట శరత్‌చంద్రారెడ్డి స్పోర్ట్స్ క్లబ్ జట్టు ఎంపికైంది. గుజరాత్‌లోని వడోదరలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ దాకా జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుండడం విశేషం. ఈ సందర్భంగా ఆ క్రీడాజట్టును నెల్లూరులోని క్లబ్ కార్యాలయంలో శరత్‌చంద్రారెడ్డి అభినందించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా మణికంఠ, వైస్ కెప్టెన్‌గా మహేంద్ర వ్యవహరిస్తున్నారన్నారు. ఈ జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధిస్తే మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ సేవాసమితి ఉప కార్యదర్శి గడ్డం నాగేంద్ర, సాయిబాబు, కమతం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పక్షవాతంపై అవగాహన కలిగివుండాలి




బి.పి, షుగర్ ఎక్కువవుతున్న తరుణంలో పక్షవాతంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అపోలో ఆసుపత్రి న్యూరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ బిందుమీనన్ పేర్కొన్నారు. నెల్లూరు దర్గామిట్టలోని ఓ హోటల్‌లో ఆదివారం అపోలో ఆసుపత్రి న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్ట్రోక్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిందుమీనన్ మాట్లాడారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్, డాక్టర్ విజయమీనాక్షి, సుందరం, లక్ష్మీనరశింహన్, సునీల్ నారాయణ, జాయ్‌వర్గీస్, యూనిట్ హెడ్ నవీన్ పాల్గొన్నారు.

## చైల్డ్ ఆశ్రమానికి విరాళం



నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్2 థియేటర్‌లో దానోత్సవ్ కార్యక్రమం జరిగింది. గొల్లపాళెం చైల్డ్ ఆశ్రమానికి టిపి సిఐఎల్ పవర్‌ప్లాంట్ డిజిఎం నమ్మిడి రాజశేఖర్‌రెడ్డి రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కోరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏటా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు దానోత్సవ్ పేరుతో పలు సేవా కార్యక్రమాల కోసం అనేక సేవాసంస్థలు విరాళాలను సేకరిస్తున్నాయన్నారు. ఎస్2 యాజమాన్యంతో కలిసి ఈ ఏడాది థియేటర్‌లో విరాళాలను సేకరిస్తామన్నారు. నేస్తం ఫౌండేషన్ సభ్యులు గాలి శివ, నేతగాని సతీష్‌బాబు, పవన్, సతీష్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ జనతా సేల్ లక్కీడ్రా!

దసరా, దీపావళి పండుగల సందర్భంగా నెల్లూరులోని సిఎంఆర్, చందన షాపింగ్ మాల్స్ తమ ఖాతాదారులకు అనేక ఆఫర్లు, డిస్కౌంట్లు, లక్కీడిప్ ద్వారా బహుమతులు ప్రకటించాయి. ఐదు వారాల పాటు లక్కీడ్రాలు నిర్వహించి, ఈ నెల 31వ తేదీన నిర్వహించే బంపర్ డ్రాలో విజేతకు టాటా టైగో కారును బహూకరించనున్నారు. ఈ నెల 2వ తేదీన నిర్వహించిన మొదటి లక్కీడిప్‌కు ఏఎస్పీ శరత్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. లక్కీడిప్ ద్వారా ఆయన 10మంది విజేతలను ప్రకటించారు. ఈ పదిమందిలో ఒకరికి టివిఎస్ స్కూటీని, ఒకరికి ఫ్రిజ్‌ను, ఇద్దరికి గ్రైండర్లను, ముగ్గురికి మిక్సీలను, మరో ముగ్గురికి కుక్కర్లను బహూకరించారు.




కస్టమర్ల ఆదరాభిమానాలు చూరగొనే విధంగా ఆఫర్లు పెడుతున్న సిఎంఆర్, చందన యాజమాన్యాన్ని ఏఎస్పీ అభినందించారు. ప్రతి 500రూపాయల వస్త్రాలు, అలాగే ప్రతి వెయ్యిరూపాయల బంగారు ఆభరణాల కొనుగోలుపై లక్కీడిప్ కూపన్లు ఇస్తున్నట్లు సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య కూడా పాల్గొన్నారు.

### అమలులోకి వచ్చిన

## 'సింహపురి' టైమింగ్స్

గూడూరు-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళలను మార్పు చేశారని, ఎంపి రాజమోహనరెడ్డి సూచనల మేరకు ఈ మార్పు జరిగిందని కావలిలోని డిఆర్‌యుసిసి సభ్యుడు కుందుర్తి కామయ్య తెలిపారు. తాజా మార్పుల మేరకు అక్టోబర్ 1 నుండి ఈ రైలు గూడూరులో సాయంత్రం 6.50గంటలకు బయలుదేరి 7.20 గంటలకు నెల్లూరు, 7.40 గంటలకు బిట్రగుంటకు వచ్చి, కావలికి 8.00గంటలకు చేరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్ళే సింహపురి ఎక్స్‌ప్రెస్ కావలి వద్ద 6.58 గంటలకు బయలుదేరి, 7.10 గంటలకు బిట్రగుంట, 7.50 గంటలకు నెల్లూరు, 8.00 గంటలకు వేదాయపాళెం, 8.50 గంటలకు గూడూరు స్టేషన్లకు చేరుకుంటుందని, ప్రయాణీకులు ఈ మార్పులను గమనించాలని ఆయన కోరారు.

## ఐఎబి సమావేశం

జిల్లా సాగునీటి సలహా కమిటి సమావేశం ఈ నెల 20వ తేదీన కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో జరుగనుంది. సోమశిలలో ప్రస్తుతం 35 టిఎంసిలదాకా నీళ్లున్నాయి. 20వ తేదీ నాటికి 40 టిఎంసీలుంటాయని అంచనా! ఆ 40 టిఎంసీల నీళ్లతో లెక్కలు కట్టి పంపకాలు నిర్ణయిస్తారు.

### ఈ-ఆఫీసులో

## జిల్లాకు ద్వితీయ స్థానం

ఈ-ఆఫీసు ద్వారా పరిపాలన నిర్వహించడంలో రాష్ట్రంలో నెల్లూరుజిల్లా రెండోస్థానంలో నిలిచిందని జేసీ-2 రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఈ-ఆఫీసు ద్వారా పరిపాలన నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఘనత జిల్లా కలెక్టర్ చొరవ ఫలితమేనని జేసీ-2 పేర్కొన్నారు. కాగిత రహిత పరిపాలన దిశగా ఈ-ఆఫీసును అమలు చేస్తున్నామన్నారు. ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ-ఆఫీసు ద్వారానే ఉండాలని, కలెక్టర్ డిజిటల్ సంతకం చేసాకే ఆ ఫైల్‌ను కలెక్టర్ ఆర్డర్‌గా అమలు చేయాలని ఆయన చెప్పారు.

## బాపూజీకి ఎస్పీ నివాళి



ఈ నెల 2వ తేదీ జిల్లా ఎస్పీ విశాల్ గున్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తులను మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు బి.శరత్‌బాబు, సూరిబాబు, ఏ.ఆర్ డిఎస్పీ చెంచురెడ్డి, ఆర్.ఐ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'రిచ్'లో చిన్నారికి అరుదైన చికిత్స



నెల్లూరు పొగతోటలో ఉన్న రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యంత అరుదైన వైద్య చికిత్సను అందించి 700 గ్రాముల బరువుతో ఎదుగుదల లేకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న బిడ్డకు పునర్జన్మనిచ్చారు రిచ్ హాస్పిటల్స్ వైద్యులు. ఈ సందర్భంగా ఆదివారం రిచ్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్స్ ఛైర్మెన్ డాక్టర్ టి.రవికుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 3వతేదీన వాకాడు గ్రామానికి చెందిన సుగుణమ్మ 26 వారాలకే 700గ్రాముల బరువుతో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, ఆ బిడ్డ పాలు తాగకపోవడం, కదలిక లేకపోవడం, ఫిట్స్ రావడంతో తల్లిదండ్రులు తమ ఆసుపత్రికి తీసుకురాగా వెంటిలేటర్లు, ఇన్‌ఫాంట్ వార్మర్స్, మల్టీపారా మోనిటర్స్, హైఫ్రీక్వెన్సీ ఆసులేటర్స్ ద్వారా సదరుబిడ్డను వైద్య నిపుణులు నారాయణస్వామి, హజరత్తయ్య, నజీర్‌లు 24గంటలు శ్రమించి ప్రాణాపాయ స్థితి నుండి రక్షించడం జరిగిందన్నారు. ఆ బిడ్డకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి ఉచితంగా వైద్యచికిత్సను అందించడం జరిగిందన్నారు.

## వాత్సల్యలో మెగా వైద్యశిబిరం




నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని జనహిత - వాత్సల్య నిరాధార బాలబాలికల ఆశ్రమంలో విద్యార్థులు, వృద్ధుల కోసం శివసాయి ప్రవీణ్ ఛారిటబుల్ ట్రస్ట్, జయభారత్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఫిజిషియన్ డా॥ సి.వి.సుబ్రహ్మణ్యం ఆరోగ్య జీవన విధానంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు సోహన్‌లాల్ పి.జైన్ 2లక్షలు విలువగల ఆర్ఓఎస్ ప్లాంట్‌ను ఇచ్చి ప్రారంభించారు. జనహిత గౌరవాధ్యక్షుడు సామంతు గోపాల్‌రెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జె.వి.ఎస్ దుర్గాప్రసాద్, సాంబశివరావు, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.



మనిషిని సృష్టించేవాడు దేవుడు... ఆ మనిషికి ఆరోగ్యం చెడి ప్రాణంపోయే పరిస్థితి వస్తే చికిత్స చేసి ప్రాణాన్ని నిలబెట్టేవాడు వైద్యుడు. మరి వైద్యులు కూడా బ్రతికించలేని రోగుల ప్రాణాలను నిలబెట్టేవాడు...? ఇక రెండో ఆలోచన ఎందుకు? అతని పేరు కూడా దేవుడే! 'దైవం మానవ రూపేణా' అని ఊరికే చెప్పలేదు. ఒక మనిషి ఆపదలో ఉన్న ప్పుడు పైనుండి దేవుళ్ళు వచ్చి ఆదుకోరు! మనుషులే ఆదుకుంటుంటారు. కాబట్టి మనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సాయం చేసే ప్రతి ఒక్కరూ దేవుడితో సమానమే! చనిపోయిన మనిషిని దేవుళ్ల స్థానంలో చూడడం మన సాంప్రదాయం. అలాంటిది తన మరణాన్ని ఆరుమంది ప్రాణం నిలపడానికి సద్వినియోగం చేసిన వ్యక్తి దేవుడు కాకుండా ఉంటాడా?

## అతను మరణించ లేదు...
# ఆరుగురిలో జీవిస్తున్నాడు

అవయవదానం... ఇదొక మానవతా ఉద్యమమై వర్థిల్లు తోంది. ఎందరి ప్రాణాలనో నిలబెడుతోంది. నెల్లూరుజిల్లాలోనే ఇటీవల కాలంలో ఎంతోమంది తమ అవయవదానం ద్వారా మిగతా వారికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. ఈ పరంపరలోనే ప్రతిఒక్కరి హృదయాన్ని తాకే ఓ మానవతావాద సంఘటనకు మళ్ళీ నెల్లూరే వేదికగా నిలిచింది. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి అవయవాలను దానం చేసి, మరో ఆరుమంది ప్రాణాలకు ఊపిరిలూదిన చరిత్రకు నెల్లూరు సాక్ష్యమైంది.

ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి బ్రతుకుదెరువు కోసం నెల్లూరుజిల్లా కొచ్చి ఇందుకూరుపేటలోని వైన్‌షాపులో క్యాషియర్‌గా పనిచేస్తుండే వాడు. అతని భార్యా, ఇద్దరు బిడ్డలు ఊర్లోనే వుంటుండగా సుబ్బారెడ్డి వారానికి ఒకసారి ఊరికెళ్లి వస్తుండేవాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి డ్యూటీ ముగించుకుని గంగపట్నంలోని బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. మొత్తలు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి పక్కనే వున్న పొదల్లో పడిపోయాడు. విషయం తెలిసి గంగపట్నంలోని బంధువులు అక్కడకు వెళ్లి సుబ్బారెడ్డిని నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 3వ తేదీ రాత్రికి సుబ్బారెడ్డి కోమాలోకి వెళ్లిపోయాడు. దీంతో వైద్యులు అతను బ్రతకడం కష్టమని, అవయవదానం చేస్తే మరికొందరిని బ్రతికించే అవకాశం ఉంటుందని చెప్పడంతో సుబ్బారెడ్డి భార్య శివకుమారి, బంధువులు కూడా అవయవ దానానికి అంగీకరించారు. దీంతో జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అవయవదానానికి నారాయణ వైద్యులు ఏర్పాట్లు చేశారు. సుబ్బారెడ్డి గుండెను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి, ఊపిరితిత్తులను చెన్నైలోని పోర్టిస్‌మలార్ ఆసుపత్రికి, కాలేయాన్ని విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి, ఒక కిడ్నీని తిరుపతిలోని స్విమ్స్‌కు తరలిం చగా మరో కిడ్నీని నారాయణ ఆసుపత్రిలోనే మరో పేషంట్‌కు అమర్చనున్నారు.

### కృష్ణపట్నం పోర్టు మానవతాసాయం



అవయవాల తరలింపులో గుండె రవాణా కీలకం. చాలా తక్కువ సమయంలో దీనిని నంబంధిత ఆసుపత్రికి తరలించి పేషంట్‌కు అమర్చాలి. ఏ మాత్రం ఆలస్యం జరిగినా అవయవదానమే వృధా అవుతుంది. దీనికి సంబంధించి కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం స్పందించిన తీరు ఎంతైనా అభినందనీయం. నెల్లూరు నుండి గుంటూరుకు గుండెను తరలించడానికి పోర్టు యాజమాన్యం తమ హెలికాప్టర్‌ను రంగంలోకి దించింది. నారాయణ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో హెలికాప్టర్‌ను దించారు. గుండెను భద్రపరచిన బాక్స్‌ను హెలికాప్టర్‌లోకి ఎక్కించి వెంటనే గుంటూరుకు తరలించారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో హీరామతిబాయ్ అనే మహిళకు శస్త్రచికిత్స ద్వారా గుండెను అమర్చారు.

అవయవదానానికి పేద, ధనిక, కులం, మతం తేడా లేదు. ఇటీవల కాలంలో అవయవదానం చేసిన వాళ్లంతా కూడా పేదలే! ఎందరి ఇళ్లలోనో దీపాలు వెలిగించి, వారి మనసుల్లో జీవనజ్యోతులై వెలుగుతున్నారు.

## కార్మికుల భవితకు బీమా...
# చంద్రన్న బీమా




చంద్రన్న బీమా పథకం ద్వారా నెల్లూరుజిల్లాలో 9.12 లక్షల మంది కార్మికులను గుర్తించామని, వారికి బీమా అందిస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ భవన ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిష్ఠాత్మకంగా చంద్రన్న బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. 18 నుంచి 70ఏళ్ళలోపు వయస్సు కలిగిన వారికి రూ.5లక్షలు, పాక్షికంగా అంగవైకల్యం ఉంటే రూ.3,62,500లు, సహజ మరణం పొందినవారికి రూ.30వేలు, 9, 10, ఇంటర్, ఐటిఐ చదివే పిల్లలకు ఒక్కొక్కరికి ఉపకార వేతనం సంవత్సరానికి రూ.1200లు అందజేస్తామన్నారు. ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు
# త్వరగా పూర్తి చేయాలి

**- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**



నెల్లూరు మూలాపేట బట్వాడిపాలెం నుండి కొత్తూరు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులు గత కొన్ని నెలలుగా నత్త నడకన సాగు తున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణతో జరిగిన సమీక్షా సమావేశంలో కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ విద్యుత్, రోడ్లు భవనాలు, నగర కార్పొరేషన్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. రొట్టెలపండుగ సందర్భంగా రాజకీయ ఫ్లెక్సీలను నిషేధించాలని మంత్రిని కోరగా మంత్రి ఫ్లెక్సీలను నిషేధించాలని మేయర్, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాజకీయ ఫ్లెక్సీలు రొట్టెల పండుగలో నిషేధిస్తున్నామని మేయర్ ప్రకటించారు. వైయస్సార్ నగర్‌లో ప్రజలకు తక్షణమే యుద్ధ ప్రాతిపదికన త్రాగడానికి మంచినీళ్లు, అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైన్‌లను ఏర్పాటు చేసేందుకు వెంటనే నిధులు కేటాయించాలని మంత్రిని కోరగా, వేగవంతంగా ఈ పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాలో వున్న పరిశ్రమల యాజమాన్యల ఆఫీసులు ఎక్కువ మొత్తంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉన్నాయని, స్థానికులకు ఉద్యోగాలు, సామాజిక సేవా నిధుల క్రింద(సిఎస్ఆర్) పరిశ్రమల యాజమాన్యాలు రూరల్ నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్‌ల నిర్మాణాలు, కమ్యూనిటి హాల్‌ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

# బాపూజీయే ఆదర్శం





బాపూజీ ఆదర్శనీయులని, ఆయన మార్గంలో అందరూ నడవాలని జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు అన్నారు. గాంధీజయంతిని పురస్కరించుకుని ఈ నెల 2న ఆయన నెల్లూరులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాపూజీని ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛభారత్, ఏడిఎఫ్ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేసుకొని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపుదిద్దుకోవాలన్నారు. మన జిల్లాను నూటికి నూరుశాతం బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా అధికారులు, ప్రజలు కృషి చేయా లన్నారు. ప్రత్యేకించి పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. జేసీ ఇంతియాజ్ మాట్లా డుతూ, బాపూజీ చూపిన బాటలో అందరూ పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, గాంధీజీ మార్గం అందరికీ శిరోధార్యమన్నారు. నగరాన్ని పరిశు భ్రతగా వుంచేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెసి రాజ్‌కుమార్, డిఆర్ఓ ఎం.మార్కండేయులు, ఏఓ మధుసూదన్‌శర్మ, నెల్లూరు తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పౌరసరఫరాల సంస్థ డి.ఎం కొండయ్య, తహశీల్దార్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

**జడ్పీ కార్యాలయం వద్ద....**

గాంధీజీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన నెల్లూరు జడ్పీ కార్యాలయంలోని బాపూజీ విగ్రహానికి జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, జడ్పీ వైస్‌ఛైర్మన్ పి.శిరీష, జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని గాంధీ విగ్రహానికి నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగు దేశం, వైయస్సార్ కాంగ్రెస్, బీజేపీ, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బిపిఎస్ గడువు పొడిగింపు

అక్రమ, అనధికార కట్టడాల క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిపిఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) దరఖాస్తుల మంజూరు గడువు సెప్టెంబర్30 నాటికి పూర్త య్యింది. అయితే ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ సోమవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఎల్‌బిఎస్ (లైసెన్స్ బిల్డింగ్ సర్వేయర్లు) ద్వారా ఆన్‌లైన్‌లోనే భవన అనుమ తులు మంజూరు చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మహాత్ముని స్ఫూర్తితోనే పేదలకు విద్య



మహాత్ముని స్ఫూర్తితోనే పేద విద్యార్థులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత విద్య, రవాణా, భోజన సదు పాయాన్ని కల్పించడానికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పించారని ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన నెల్లూరు కనుపర్తిపాడు లోని విపిఆర్ విద్య స్కూల్‌లో నిర్వహించిన గాంధీజీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరాన్ని సత్యాగ్రహంగా మలచి, హింసతో కాదు, అహింసతోనే విజయాలను సాధించవచ్చని ప్రపంచానికి చాటిన మానవతామూర్తి బాపూజీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వి.టి.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాపూజీ అడుగుజాడలే మనకు స్ఫూర్తి

## - డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య



భారత జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను, సిద్ధాంతాలను, అహింసా వాదాన్ని, శాంతి సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి ప్రజానీకం, యువత ముందుకెళ్లాలని, మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడుచుకోవడమే ఆయనకు నిజమైన నివాళని నెల్లూరుజిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య అన్నారు. ఈ నెల 2వ తేదీ ఆదివారం ఇందిరాభవన్‌లో మహాత్మాగాంధీ, మాజీప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ, యూత్‌కాంగ్రెస్, మైనార్టీ, బిసి, ఎస్సీ, ఎస్టీ, సేవాదళ్, కార్యకర్తలు తెల్లటి ఖాదీ పంచెలు, చొక్కాలు ధరించి వినూత్నంగా 200మందితో పాదయాత్రగా ఇందిరాభవన్ నుంచి "గాంధీ స్ఫూర్తిని తీసుకోండి... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వండి" అనే నినాదం చేసుకుంటూ టిడిపి, బీజేపీ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర చేసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ టిడిపి, బీజేపీ ప్రభుత్వాలు మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకుని ఆయన స్ఫూర్తితో మన రాష్ట్రానికి ప్రత్యేకహోదా అమలు చేయాలని, అప్పుడే ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. పిసిసి నాయకులు సి.వి.శేషారెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబు యాదవ్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు భవానీ నాగేంద్ర ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ శీలం తిరుపతయ్య, బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ గాలాజు శివాచారి, మైనార్టీ సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ షేక్ ఆసిఫ్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు కేశవ్‌నారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లి బాలకృష్ణ, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు చిలకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కెఎన్‌ఆర్‌లో స్వచ్ఛభారత్



నెల్లూరు బివినగర్‌లోని కురుగంటి నాగిరెడ్డి (కెఎన్‌ఆర్) నగరపాలక ఉన్నత పాఠశాలలో 10 ఆంధ్ర నావల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో గత నెల 30వతేదీన కెఎన్‌ఆర్ పాఠశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గత నెల 26 నుండి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన స్వచ్ఛభారత్ వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కెఎన్‌ఆర్ హైస్కూల్ ఎన్‌సిసి నావల్ యూనిట్ అధికారి గుండాల నరేంద్రబాబు వివరించారు.




# జేసీస్ ప్రతిభా ప్రోత్సాహం

జేసీఐ నెల్లూరుటౌన్ ఆధ్వర్యంలో 4వ తేదీ నెల్లూరు పప్పులవీధిలోని జేసీస్ భవన్‌లో 'జేసీస్ గ్రాండ్ డే' ఘనంగా జరిగింది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 40మంది విద్యార్థులకు ముఖ్యఅతిథులు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ చేతులమీదుగా నగదు బహుమతులందజేశారు. అలాగే ఇటీవల వియత్నాం రాజధాని హునాయ్‌లో జరిగిన ఏషియన్ యోగా పోటీలలో 3 బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించిన ఏకాంబరం జోష్ణవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీస్‌కు చెందిన వి.ఇ.మురళీకృష్ణ, సురేష్, కె.సత్యనారాయణ, సి.వి.శరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ శిక్షణా తరగతులు



నెల్లూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ, ఈ నెల 1వ తేదీలలో గీతాంజలి పిజి కాలేజీలో 225మంది ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక ఉపాధ్యాయులకు "టీచ్ ప్రోగ్రాం" క్రింద రాయల్ సొసైటి ఆఫ్ కెమెస్ట్రీ వారిచే రసాయనిక శాస్త్రం సులభ రీతిలో విద్యార్థులకు బోధించే పద్ధతులు గురించి శిక్షణా తరగతులు నిర్వహించారు. నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఉచితంగా మెటీరియల్ రాయల్ సొసైటి ఆఫ్ కెమిస్ట్రీ, బెంగుళూరువారు అందజేశారు. ముగింపు శిక్షణా కార్యక్రమంలో డిఇఓ రామలింగం, రొటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు ఎస్.విజయరామిరెడ్డి, వేలూరు శ్రీనివాసులు, రోటరీ జిల్లా కార్యదర్శి ఎస్.రాఘవేంద్రషెట్టి, దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, వి.ధనుంజయరెడ్డి, మునిగిరీష్, నేతాజీ సుబ్బారెడ్డి, రొటేరియన్లు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### పండరి భజన భక్తులకు...

# గజ్జెలు, కోలాటం పరికరాలు



సామాగ్రిని అందిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన, ప్రక్కన ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి

గూడూరు 28వ వార్డు పరిధిలో వున్న పండరి భజన భక్తులకు ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పిఎస్‌ఆర్ ట్రస్టు సహకారంతో రూ.30 వేలు విలువచేసే గజ్జెలు, కోలాటం పరికరాలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అందజేశారు. 35మంది భజన బృందం సభ్యులకు ఆమె వస్తువులను ఇచ్చారు. ఈ సందర్భంగా పొనకా దేవసేన మాట్లాడుతూ జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు, కళలు ద్వారా జీవన భృతి కల్పించాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడుతూ కోలాట కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారని అన్నారు. కోలాట కళాకారులకు ఆర్థిక సాయం అందించేందుకే మా ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళామండలి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పరమేశ్వరి, జీవని, శశికళ, పరంజ్యోతి, నాగసూరిలక్ష్మి, సులక్ష్మి, కౌన్సిలర్లు శ్రీనివాసులు, మస్తానమ్మ, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

### సునీతా సేవా సంస్థ ఆధ్వర్యంలో

# చిన్నారుల నృత్య ప్రదర్శన

గూడూరు సబ్‌జైలులో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని జైలర్ వెంకటేశ్వర రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి పి.గుర్రప్ప పాల్గొని మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులు జీవితంలో మళ్ళీ చేయకూడదన్న ఉద్దేశ్యంతో పరివర్తన కోసమే జైళ్లను ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో సునీతా సేవా సంస్థ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీ సాయి నృత్య బృందం శిక్షకురాలు పెద్దిశెట్టి శైలజాకుమారి మార్గదర్శనంలో చిన్నారులు హ్రిద్యశ్రీ(హని), జ్వలిత కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించి అందరినీ ఆకట్టుకొన్నారు. చిన్నారులకు జిల్లా జడ్జి గుర్రప్ప చేతులమీదుగా సునీతా సేవాసంస్థ అధ్యక్షులు సారంగం శ్రీనివాసులు జ్ఞాపికను అందజేశారు. నాట్య శిక్షకురాలు పెద్దిశెట్టి శైలజాకుమారిని జడ్జి గుర్రప్ప అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సీనియర్ సివిల్ జడ్జి ఏడుకొండలు, అదనపు జూడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కె.పి.సాయిరాం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దివాకర్, యోగా మాస్టర్ కట్టా మురళీకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.



నాట్య ప్రదర్శన చేస్తున్న హ్రిద్యశ్రీ, జ్వలిత



చిన్నారులకు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా జడ్జి గుర్రప్ప

# శరన్నవరాత్రి వేడుకలు



గూడూరులో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలో దేవతామూర్తులు విశేషాలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సొసైటీలోని మహాలక్ష్మమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో నారాయణమ్మ పేరంటాళ్లు అమ్మవారు రాజరాజేశ్వరీ అలంకరణలో, బజారువీధిలోని అమ్మవారి ఆదిపరాశక్తి రూపంలో, వాసవి కన్యకాపరమేశ్వరి, హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి, మాలవ్యానగర్‌లోని మహాలక్ష్మమ్మ అమ్మవారు కూడా వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించారు.

# కోనేటిలో కోదండరాముని తెప్పోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణం కోనేటి మిట్టలో ఉన్న కోనేరులో కోదండ రామాంజనేయ స్వామి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై స్వామి వారిని పూలంకరణతో ముస్తాబు చేశారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారు కోనేరులో విహరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, శీలం కిరణ్‌కుమార్, కనుమూరు హరిచంద్రారెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు తెప్పోత్సవంలో పాల్గొని విశేషపూజలు చేపట్టారు. బాణాసంచా మోతలతో ఆ ప్రాంతమంతా రంగురంగులతో ధగధగ మెరిసిపోయింది. అధికసంఖ్యలో భక్తులు తెప్పోత్సవంలో పాల్గొన్నారు.

## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు



బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 7.10.2016 నుండి
తేది. 13.10.2016 వరకు

ఈ వారము సింహంలో రాహువు, కన్యలో బుధగురువులు, తులలో రవిశుక్రులు, వృశ్చికంలో శని ధనుస్సులో కుజుడు, కుంభంలో కేతువు, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 7 శుక్రవారము సరస్వతీపూజ, తేది 9 ఆదివారము దుర్గాష్టమి, తేది 10 సోమవారము మహర్నవమి, తేది 11 మంగళవారము విజయదశమి.

### ముహూర్తములు:

తేది 13 గురువారము ఉదయం గంట 7.30 నుండి గంట 8.47లోగా తులా లగ్నమున గృహారంభ, వివాహ, వ్యాపారములు.

### ఆశ్వయుజ శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 7 | శుక్ర | షష్ఠి | సా॥ గం.3.11వ॥ |
| తేది. 8 | శని | సప్తమి | సా॥ గం.4.28వ॥ |
| తేది. 9 | ఆది | అష్టమి | సా॥ గం.5.19వ॥ |
| తేది. 10 | సోమ | నవమి | సా॥ గం.5.38వ॥ |
| తేది. 11 | మంగళ | దశమి | సా॥ గం.5.28వ॥ |
| తేది. 12 | బుధ | ఏకాదశి | సా॥ గం.4.47వ॥ |
| తేది. 13 | గురు | ద్వాదశి | సా॥ గం.3.40వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

నూతన పెట్టుబడులకు అనుకూల పరిస్థితులుంటాయి. ఉద్యోగ ప్రయత్నం ఫలించగలదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. అధికారుల వల్ల వత్తిడి, పనిభారం ఉద్యోగులకు తప్పనిసరిగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధి పథకాలు కార్యరూపం దాల్చగలవు. వృత్తి వ్యాపార వర్గాల అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి జీవనంలో ప్రాబల్యం సంపాదించుకొంటారు. వివాహాది ప్రయత్నాల్లో అనుకూలత, కొత్త వస్తువులను సమకూర్చుకొనడం, దూర ప్రయాణాలుండటం, తీర్థ క్షేత్ర సందర్శన కలుగుతుంది. ఆత్మీయుల నుండి మంచి వార్తలు వింటారు. శాస్త్ర సాంకేతిక క్రీడా కళారంగాల వారికి అవకాశాలు బాగుండును. వ్యాపకాలను పెంచుకొంటూపోతారు. అందుచే పనిభారం పెరుగుతుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిరుద్యోగులకు చిరు అవకాశాలు లభించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. బాకీల వత్తిడి పెరుగుతుంది. అనవసర విషయాలకు దూరంగా ఉండండి. దూకుడుగా మాటల తీరు, నిర్లయాల వల్ల ఇబ్బందులుపడతారు. వ్యాపారవర్గాలకు ఆశించిన ఆదాయం ఉండదు. అనుకున్న పనులు పట్టుదలగా పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో పొరపొచ్చాలు రాకుండా చూసుకోవాలి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కండరాలు నరాల బాధలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు, కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు జరుపుతారు. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత, దైవ, కార్యక్రమాలలో పాల్గొనడం, దూర ప్రయాణాలుంటాయి. సంప్రదింపులు, కమిటి మీటింగులలో ప్రాముఖ్యత పొందుతారు. ఆదాయం సామాన్యం.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, క్యాంపులుంటాయి. సమావేశాలు సభలందు మీ సూచనలకు ప్రాధాన్యత ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనడం మంచిది. ఆరోగ్యం ఫరవాలేదు. కుటుంబ విషయాలు, శుభకార్య విషయాలపై దృష్టి పెడతారు. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆదాయం పెరుగుతుంది.

### మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఉద్యోగ జీవనం బాగుండి అధికారులతో సఖ్యత బాగుంటుంది. వివాదాల జోలికిపోవద్దు. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభకార్యాలందు అనుకూలత ఉంటుంది. వ్యాపారాలలో అభివృద్ధి అనుభవం పొందుతారు. ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో రాబడి బాగుంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెండింగ్ సమస్యలు పరిష్కారానికి రాగలవు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకడం, ఉద్యోగులపై ప్రత్యేక బాధ్యతలు ఏర్పడతాయి. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి కళా(క్రీడా)రంగాల వారికి అవకాశాలు అందుతాయి. మీ మాట, మీ నిర్ణయాలు చెల్లుబాటు కాగలవు. మంచి పనులకు డబ్బు సహాయం చేస్తారు. ప్రయాణ ఫలితాలు అనుకూలిస్తాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ప్రముఖులను కలుసుకునే అవకాశాలు రావచ్చును. కుటుంబ సౌఖ్యముంటుంది. కొత్త వస్తువులు, గృహోపకరణాలు కొంటారు. ఉద్యోగ ప్రయత్నాల్లో అవకాశాలు దొరుకుతాయి. వివాహ ప్రయత్నాల్లో ముందుకు సాగుతారు. బంధుమిత్రుల సహకారంతో పనులు జరుపుకొంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొనండి. స్థిరాస్తుల క్రయవిక్రయాల విషయంలో తొందరవద్దు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. పనులు నిదానంగా జరుగుతాయి. అయిన వాళ్లు, మిత్రులు మీకు సహాయపడతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి ఉపాధి పథకాలలో ఆదాయం బాగుండినా అసంతృప్తి ఉంటుంది. వ్యాపార అవకాశాలు సరిగా ఉండవు. పెండింగ్ పనులను రాజీ మార్గంలో పరిష్కారం జరపాలి. గృహవస్తువాహన రిపేర్లుంటాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ వ్యయాలు సరిపోతూ సంతృప్తినిస్తాయి. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. పిల్లల వల్ల సమస్యలు రావచ్చును. అనుకున్న పనులు సాఫీగా జరుగుతాయి. అనుకోని ప్రయాణాలుండటం, బంధువులను కలుసుకోవడం జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. శుభకార్యాలు నిర్ణయం వైపు సాగుతాయి. విలువైన వస్తువులు, డబ్బు జాగ్రత్తగా కాపాడుకొనండి.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఒప్పందాలలో, స్థిరాస్తుల విక్రయాలలో తొందరపడకండి. అనుకున్న పనులకు ఆటంకాల వల్ల నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులు అధికారులతో చేరువకాగలరు. కొన్ని అనవసర ఖర్చులు పైనబడగలవు. వృత్తి ఉపాధి రంగాల వారికి రాబడి కొంత మేలుగ ఉంటుంది. వ్యవసాయదారులు ఇబ్బందిపడతారు. హామీలు, రాయబారాలు మానడం మంచిది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దీర్ఘకాలిక అభివృద్ధికి గాను ఆలోచనలుంటాయి. ఆరోగ్య పరిరక్షణ అవసరం. బంధుముఖ్యులను కలుసుకొంటారు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి. ఉద్యోగులకు పనిభారం పెరిగినా అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబసౌఖ్యముంటుంది. పెట్టుబడులు వ్యాపార విస్తరణకు అనుకూలంగా ఉంటాయి.

# బాబు బెటాలియన్ సర్జికల్ స్ట్రైక్స్




విజయవాడలోని హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాలయం. బయట ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ వుంది. లోపలంతా గంభీర వాతావరణం నెలకొనివుంది. అప్పుడే లోపల నుండి చంద్రబాబు, మంత్రులు కామినేని శ్రీనివాస్, పత్తిపాటి పుల్లారావు, నిమ్మకాయల చినరాజప్ప, పి.నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, అచ్చెన్నాయుడులు వచ్చారు. అందరూ ముఖాలకు కందెన పూసుకుని పారా కమెండోల డ్రెస్‌లు వేసుకుని వున్నారు. అందరి ముఖాల్లోనూ కసి, గెలిచితీరాలన్న తపన కనిపిస్తోంది. అప్పుడే లోకేష్ వచ్చి... నాన్నా, ఈ సర్జికల్ స్ట్రైక్‌లో నేను కూడా పాల్గొంటాను అని అడిగాడు. అందుకు కమాండర్ చంద్రబాబు... వద్దు బాబు, ఈ ఆపరేషన్ చాలా కష్టంతో కూడుకున్నది, లోయల్లో దిగాలి, బురద గుంటల్లో పొర్లాడాలి, అక్కడ పాములుంటాయి, కప్పలుంటాయి, ఒక్కోసారి బురదగుంటల్లోనే కూర్చుని ఆహారం తినాల్సి వుంటుంది, అదీగాక ఈ ఆపరేషన్‌లో పొరపాటున మాకు గాయాలై ఆసుపత్రి పాలైతే, మేము కోలుకునేదాకా ఈ ప్రభుత్వాన్ని నువ్వే నడపాల్సి ఉంటుంది. కాబట్టి నువ్వు ఇక్కడే వుండు... మా నెత్తిమీదున్న హెల్మెట్లకు కెమెరాలు అమర్చుకున్నాం, మా సాహసోపేతమైన సర్జికల్ ఆపరేషన్‌ను నువ్వు టీవీలో చూసి ఆనందించు అని చెప్పాడు. తర్వాత భువనేశ్వరీదేవితో పాటు తెలుగు మహిళా నాయకురాళ్లు పీతల సుజాత, కిమిడి మృణాళిని, కొత్తపల్లి గీత తదితరులు వచ్చి బాబు బెటాలియన్‌కు...

*మంగళం, జయమంగళం*
*వీరాధివీరులకు శుభమంగళం*
*తెలుగు వీరులకు వందనం*
*తెగించిన సూరులకు శుభవందనం*
*ఆంధ్రా లెజెండ్‌లకు జయం జయం*
*ఆంధ్రా సింహాలకు జయం జయం...*

అంటూ పాట పాడి మంగళహారతులిచ్చారు. చంద్రబాబు బెటాలియన్ బయటకొచ్చింది. అక్కడేవున్న ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి... సార్, యుద్ధానికి వెళ్లేముందు దున్నపోతును బలి ఇవ్వడం మన రాజుల కాలం నుండి వస్తున్న సాంప్రదాయం, ఇటీవల 'బాహుబలి' సినిమాలో కూడా ఆ సీన్ చూసాను, మొన్న వెంకటగిరి జాతరలో మిగిలిపోయిన దున్నపోతు ఒకటుంటే తెచ్చాను. బలివ్వండి సార్... అని అడిగాడు. దానికి చంద్రబాబు... ఈరోజు శనివారం, నేను ఎటువంటి జీవహింస చేయను అని అన్నాడు. అప్పుడు సోమిరెడ్డి మనసులో... జీవహింస చేయవా, మరి సర్జికల్ స్ట్రైక్‌కు వెళ్లేది చెక్కభజన చేసుకోవడానికా...? అని అనుకున్నాడు. అప్పుడే మున్సిపల్ శాఖ కార్యదర్శి గిరిధర్ వచ్చాడు. ఒక పెద్ద మ్యాప్ తీసి ఆయన ముందు పెట్టి... సార్, మనం సర్జికల్ స్ట్రైక్స్ చేయాల్సిన ప్రాంతాలను గుర్తించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా గుర్తించిన ఈ ప్రాంతాల మీద దాడి చేస్తే చాలు, శత్రువులను సమూలంగా నిర్మూలించవచ్చు. మనకు స్వదేశీ టెక్నాలజీ మీద అంత నమ్మకం లేదు కాబట్టి ఇస్రోను నమ్ముకోకుండా అమెరికా అంతరిక్ష కేంద్రం నాసా ఉపగ్రహాలు తీసిన ఫోటోలు తెప్పించాను, అవి తీసిన ఫోటోలలో శత్రు శిబిరాలు క్లియర్‌గా కనపడుతున్నాయి. మనం ఖచ్చితంగా లక్ష్యాలను గురి చూసి కొట్టొచ్చు అని చెప్పాడు. మిషన్‌లన్నీ బాగా పనిచేస్తున్నాయిగా, అన్నీ రెడీగా పెట్టారుగా అని చంద్రబాబు అడిగాడు. అందుకు మున్సిపల్ కార్యదర్శి గిరిధర్... అన్నీ హెలికాప్టర్‌లో రెడీగా పెట్టాం సార్, ఇందుకోసం ఇజ్రాయిల్ నుండి దిగుమతి చేసుకున్న అత్యాధునిక వెపన్స్‌ను అందుబాటులో ఉంచామన్నాడు. వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులందరూ చంద్రబాబు బెటాలియన్‌కు పండ్లు, బిస్కెట్లు, స్వీట్లు, పులిహోర, బిర్యానీ ప్యాకెట్లు అందిస్తూ... ఈ ఆపరేషన్ మొదలైతే మీకు తిండి కూడా దొరకదు. దారిలో తినడానికి ఇవి ఉంచండని చెప్పారు. చంద్రబాబు హెలి కాప్టర్ ఎక్కే ముందు ప్రధాని నరేంద్ర మోడీతో, కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుతో తాము సర్జికల్ ఆపరేషన్‌కు బయల్దేరుతున్నట్లు చెప్పాడు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసాన్ని మీరు చేస్తున్నారు. భవిష్యత్‌లో కూడా సర్జికల్ స్ట్రైక్ చేసిన ఏకైక ముఖ్యమంత్రిని నేనే అని మీరు చెప్పుకోవడానికి ఉపయోగపడుతుంది. మీ ఆపరేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను... బెస్టాఫ్‌లక్ అని వారు ఫోన్‌లో చెప్పారు. అప్పుడే ఏపి ఎల్లో ఛానెల్స్‌లో చంద్రబాబు సర్జికల్ ఆపరేషన్‌పై 'బ్రేకింగ్ న్యూస్' అంటూ వార్తలు రాసాగాయి. ఏబిసిడి ఛానెల్ అయితే ఈ సర్జికల్ స్ట్రైక్‌లో చంద్రబాబు సక్సెస్ అవుతారని మీరు భావిస్తున్నారా? అంటూ పాఠకులకు ఒక ప్రశ్న వదిలింది. ఒక్క నిముషంలోనే సక్సెస్ అవుతారని 99 శాతం మంది, ఫెయిలవుతారని ఒక్క శాతం మంది అభిప్రాయాలు పంపినట్లు కూడా ఫలితాలు ఇచ్చేసింది.

తెలుగు నాయకులు కార్యకర్తలందరూ జాతీయ పతాకాలతో పాటు, పార్టీ జెండాలు కూడా ఊపుతుండగా బాబు బెటాలియన్ హెలికాప్టర్ ఎక్కి సాహస యాత్రకు బయలుదేరింది.

★★★★★

విజయవాడలోని సిఎం ఇంట్లో లోకేష్ కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చుని టెన్షన్‌గా చూస్తున్నాడు. హెలికాప్టర్ వెళ్తున్నదంతా అందులో వస్తుంది. హెలికాప్టర్ ఓ చోట ఆగింది. అక్కడంతా చిమ్మ చీకటిగా వుంది. చంద్రబాబుతో పాటు మిగతా కమెండోలు పారాచూట్లతో హెలికాప్టర్ నుండి కిందకు దూకసాగారు. ఆ దృశ్యాలు చూస్తుంటే లోకేష్ ఒంటి మీద వెంట్రుకలు నిక్కబొడుచుకోసాగాయి. అతనిలో టెన్షన్ పెరిగింది. పారాచూట్లతో అందరూ ఓ బురదగుంటలో దిగారు. ఆ గుంటలో పందులు కూడా వున్నాయి. వీటిని లెక్కచేయకుండా చంద్రబాబు బెటాలియన్ అందులో దిగింది. కమాండర్ చంద్రబాబు మిగతా కమెండోలను... పొజిషన్ తీసుకోండి అని ఆదేశించాడు. అందరూ తమ చేతుల్లో వున్న మిషన్‌లను బురదగుంటలవైపు ఎక్కుపెట్టారు. చంద్రబాబు ఇక ఆలస్యం చేయకుండా 'ఎటాక్' అంటూ అరిచాడు. అంతే కమెండోలంతా తమ చేతుల్లో వున్న మిషన్‌లను గట్టిగా కొట్టసాగారు. ఆ మిషన్‌ల గొట్టాల్లోంచి పెద్దఎత్తున పొగ రాసాగింది. ఆ పొగ ధాటికి ముదురు దోమలు 'జుయ్' అంటూ లేచాయి. ఆ పొగ దెబ్బకు అవి అక్కడే ఛస్తున్నాయి. స్క్రీన్ మీద ఆ దృశ్యాలు చూస్తున్న లోకేష్కు ఏమీ అర్థం కాలేదు. సర్జికల్ స్ట్రైక్ అంటే పాకిస్థాన్‌లో వున్న ఉగ్రవాదులను చంపడానికేమోననుకున్నా... శ్రీకాకుళంలో ఉండే దోమలను చంపడానికా వీళ్లు వెళ్లింది, 'దోమలపై దండయాత్ర' పేరుకు సర్జికల్ స్ట్రైక్ అన్న ముసుగు తగిలించారా అని ఆశ్చర్యపోయాడు. అప్పుడే కంప్యూటర్ స్క్రీన్ మీద చంద్రబాబు ఫాగింగ్ మిషన్‌ను గాల్లోకి విజయగర్వంతో లేపి... ఢిల్లీలో వున్న వెంకయ్యనాయుడుకు ఫోన్ చేసి... సార్, మా సర్జికల్ స్ట్రైక్ సక్సెస్. శ్రీకాకుళం జిల్లాలో వున్న ముదురు దోమల శిబిరాలన్నింటినీ ధ్వంసం చేసామన్నాడు. అవతల నుండి వెంకయ్య నాయుడు... వెరీగుడ్ చంద్రబాబు, ఏదైనా నీకే సాధ్యం అంటూ అభినందించాడు. (..ఇంకా వుంది)

# ఉమాకు తాపీ ధర్మారావు పురస్కారం



మనవాడు, మన నెల్లూరీయుడు ఉమా మహేశ్వరరావుకు పాత్రికేయ-సాహితీరంగాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన తాపీ ధర్మారావు పురస్కారం లభించింది. ఇది ఎంతో సంతోషించదగ్గ విషయం. ప్రముఖ పాత్రికేయుడుగా, కథా రచయితగా, సాహితీ విమర్శకుడుగా ఆర్ఎం ఉమామహేశ్వర రావు ఆయా రంగాల్లో ఎంతో మంచిపేరు తెచ్చుకున్నారు. 1986 నుంచి పాత్రికేయరంగంలో వుంటూ నేటికీ దినపత్రికా రంగంలో గురుతరమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. నిగర్వి, ఎంత తెలిసినా ఇంకా తెలుసుకోవాలనే తపన, జిజ్ఞాస వున్న పాత్రికేయుడాయన. ప్రస్తుతం రాయలసీమ, నెల్లూరుజిల్లాల పరిధిలో ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏబిఎన్ ఆంధ్రజ్యోతి టీవీ పర్యవేక్షణ బాధ్యతల్లో వున్నారు. సూళ్ళూరుపేట మండలం మన్నారుపోలూరు గ్రామం ఆయన స్వస్థలం. నెల్లూరు జిల్లాలో సారా వ్యతిరేకోద్యమంపై, ఆర్థికమండళ్ళ ప్రభావంపై ఆయన రాసిన కథనాలు సంచలనం సృష్టించాయి. తెలుగువాణి అనే సంస్థతో కలిసి శ్రీలంక, బంగ్లాదేశ్‌లో పర్యటించి అక్కడి తెలుగువారి గురించి పలు కథనాలు రాసి మరెంతో సుప్రసిద్ధులయ్యారు. ఈ నెల 17న తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగే వేడుకల్లో ఉమా ఈ పురస్కారం అందుకోనున్నారు. తిరుపతి ఆకాశవాణి డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీకవి భువనచంద్ర ముఖ్య అతిథిగా, టిటిడి ప్రత్యేక అధికారి ముక్తేశ్వరరావు విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు. కాగా, గతంలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రసిద్ధులు, ప్రముఖ పాత్రికేయులు, సాహితీయోధులు అయిన ఎన్.వేణుగోపాల్, కె.శ్రీనివాస్, టంకశాల అశోక్, జి.శ్రీరామమూర్తి, ఏ.కృష్ణారావు అందుకున్నారు. ఈ ఏడాది తాపీ ధర్మారావు పురస్కారానికి ఉమా ఎంపిక కావడం ఎంతో అభినందనీయం.

ఇంతటి ప్రసిద్ధమైన పురస్కారం అందుకుంటున్న ఉమా నెల్లూరీయుడు కావడం సింహపురి సీమకే గర్వకారణం. పాత్రికేయరంగంలోనూ, సాహితీరంగంలోనూ ఉమామహేశ్వరరావు మరెన్నో విశిష్టమైన రచనలు చేసి, మరెంతో ఖ్యాతిపొంది సింహపురి సీమ పేరుప్రఖ్యాతులను మరింతగా ద్విగుణీకృతం చేస్తారని ఆశిద్దాం!...

# గుర్రాల రమణయ్యకు రావూరి భరద్వాజ పురస్కారం



ప్రముఖ కవి, నెల్లూరుకు చెందిన గుర్రాల రమణయ్య ఈ నెల 1న హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని జీవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. పురస్కార గ్రహీత గుర్రాల రమణయ్యను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించి, పురస్కారంతో పాటు రూ.2500 నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాల రమణయ్య మాట్లాడుతూ, రావూరి భరద్వాజ జీవించివున్నప్పుడు జరిగిన కవితల పోటీలో విజేతగా తాను బహుమతిని అందుకున్నానని, ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం తనకెంతో ఆనందం కలిగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రావూరి భరద్వాజ మనుమడు సాయి సుమంత్‌తో పాటు, ప్రముఖులు హైమావతి భీమన్న, పాలకుర్తి మధుసూదనరావు, కళా వెంకట దీక్షితులు, ప్రహర్షిని తదితరులు పాల్గొన్నారు.

# క్లాసులు నిర్వహిస్తే చర్యలు



దసరా సెలవుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వైకాపా విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శేషగౌడ్ డిమాండ్ చేశాడు. 5వ తేదీ నెల్లూరులోని పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 12వ తేదీ వరకు విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటిస్తే ప్రైవేట్ విద్యా సంస్థలు మాత్రం సెలవురోజుల్లో కూడా ర్యాంకుల కోసం తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను మానసికంగా కుంగదీస్తున్నారన్నారు. సెలవుల్లో విద్యార్థులు సొంత ఊర్లకు వెళ్లి బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారని, ప్రైవేట్ విద్యాసంస్థలు అలాంటి అవకాశాన్ని లేకుండా చేస్తున్నాయని విమర్శించాడు. డిఇఓకు, ఆర్ఐఓకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించాడు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం నాయకులు వెంకటేష్, రాకేష్, మధు, నారాయణ, సోము, పవన్, హరి తదితరులు పాల్గొన్నారు.





## కావలి కబుర్లు



### వంటేరు పాదయాత్రతో...

# రాజ'కీ'య వేడి

## నష్టనివారణకు ఢిల్లీలో ఎమ్మెల్యే పాట్లు

*నిన్న, మొన్నటి వరకు కావలి వైకాపాలో స్తబ్దుగా ఉండగా రామాయపట్నం పోర్టు సాధన పాదయాత్రతో రాజ'కీ'యం వేడెక్కింది.*

రామాయపట్నం పోర్టు సాధన కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి చాలాకాలంగా పోర్టుసాధనకు పాదయాత్ర చేయాలనే తలంపుతో ఉన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమం చేయాలని అనుకున్నా.. సొంతపార్టీ వైకాపా నుంచి పూర్తి మద్దతుకు చివరివరకు చాలా తర్జనభర్జనలు జరిగినట్లు వినికిడి. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వర్గంలో గుబులు రేగి ఎక్కడ వంటేరుకు సొంతమైలేజీ వస్తుందోనన్న సందిగ్ధానికి గురయినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో నేరుగా వంటేరు రంగంలోకి దిగి పాదయాత్రకు వైసిపిలోని నాయకులందరినీ ఆహ్వానించారు. దీంతో ఎమ్మెల్యే వర్గం కాదనలేక.. ఔననలేక..ఎట్టకేలకు కార్యక్రమంలో పాల్గొనక తప్పలేదని తెలుస్తుంది. పాదయాత్రకు నెల్లూరు యంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఒంగోలు యంపి వై వి సుబ్బారెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి లతో పాటు ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తూమాటి మాధవరావు, ప్రకాశం జిల్లా సిపిఐ కార్యదర్శి అరుణమ్మలు హాజరయ్యేలా చేసి వంటేరు సఫలీకృతులయ్యారు.

పాదయాత్ర ప్రారంభం వరకు అంటీ ముట్టనట్లు ఉన్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి వర్గం ముఖ్యనాయకులు రాకతో కార్యక్రమంలో పాల్గొని ఎక్కడలేని ఉత్సాహాన్ని ప్రదర్శించారని చర్చించుకుంటున్నారు. జన సమీకరణలోనూ ఎమ్మెల్యే వర్గం నుంచి సహకారం ఉంటుందో లేదోనని వంటేరు వర్గం ముందుగానే మేళ్ళోని సొంత మండలమైన జలదంకి నుంచి భారీగా జన సమీకరణ చేశారని సమాచారం. ఏది ఏమైనా ఈ పాదయాత్ర విజయవంతం కావడంతో అసలు చర్చ తరువాత మొదలైంది. పాదయాత్ర వల్ల ఎవరికెంత రాజకీయ మైలేజి వచ్చిందనే లెక్కలు రెండువర్గాలు బేరీజు వేసుకున్నారని తెలిసింది. ఈ క్రెడిట్ అంతా వంటేరు వైపే మొగ్గు చూపుతుండడంతో ఎమ్మెల్యే వర్గం ఆగమేఘాల మీద నష్టనివారణ చర్యలు చేపట్టినట్లు, తమ వల్లే పాదయాత్ర విజయవంతం అయినట్లు చెప్పుకోవడం సర్వత్రాచర్చాంశనీయమైంది. దీనికి తోడు ఢిల్లీ వెళిన ఎమ్మెల్యే రామాయపట్నంలో పోర్టును నెలకొల్పాలని కేంద్ర మంత్రుల వద్ద హడావిడి చేయడంలోనూ వంటేరుకు వచ్చిన మైలేజిని తగ్గించడానికేనని ఓ వైపు తెదేపా బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తుంది. వైకాపాలో పార్టీ వ్యవహారాలు, నిర్ణయాలు తీసుకోవడంలో సమన్వయ లోపంపై గుర్రుగావున్న కాటంరెడ్డి సైతం వంటేరు ఆహ్వానాన్ని మన్నించి పాదయాత్రలో పాల్గొనడంతో ఆయన అభిమానులు ఉత్సాహంగా వచ్చి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

వైకాపా అధినాయకత్వం వంటేరును అభినందించడంతో రామిరెడ్డి వెంటనే తాను ఎక్కడ రాజకీయంగా వెనుకబడతానోనని వంటేరును వదలి ఢిల్లీ వెళ్ళి రామాయపట్నంలో పోర్టును నెలకొల్పాలంటూ కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ముందు వాలినట్లు తెలుస్తుంది. రామాయపట్నం పోర్టు సాధన కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసి, వైకాపా నాయకులందరినీ ఒకే వేదికపైకి చేర్చి పోర్టు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించిన వంటేరు లేకుండా రామిరెడ్డి ఒక్కడే ఢిల్లీ వెళ్లి భాజపా పెద్దలను కలవడంలోనే ఆయన అంతరార్థం ఏమిటో అర్థమౌతుందని వంటేరు సన్నిహితులు చర్చించుకుంటున్నారు...

# తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యం

తెలుగుదేశం ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరూపించారని రోడ్లు భవనాలశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సిద్దా రాఘవరావు అన్నారు. సోమవారం రాజధాని నిర్మాణ కమిటీసభ్యులు బీదామస్తాన్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెద్ద పవనిరోడ్డులో నూతనంగా నిర్మించిన రోడ్డును, మున్సిపల్ కార్యాలయంలో సీఆర్‌సి బిల్డింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర విభజన అనంతరం లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో ఎక్కడా రాజీపడకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వం ప్రత్యేకహోదా సాధ్యం కాదని, అందుకు సమానంగా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిందని దీన్ని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బీదా రవిచంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, ఏఎంసి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, పట్టణఅధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి అమరా వేదగిరి, నాయకులు కేతిరెడ్డి రామకోటారెడ్డి, పులి చక్రపాణి, కౌన్సిలర్ రజని, ఆర్‌డీఓ ఎమ్ఎల్ నరసింహం, తహశీల్దారు కె.సాంబశివరావు, కమీషనర్ వెంకటేశ్వర్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రోడ్లు, భవనాల శాఖామంత్రి సిద్ధారాఘవరావు

# ఉపాధ్యాయులతోనే మంచి సమాజం



మంచి ఉపాధ్యాయులతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని సాయికోఆపరేటివ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జి.గోపాల్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 5న ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న సద్దా ఉమామహేశ్వర రెడ్డి, ఏ.చంద్రమౌళేశ్వర్, షేక్.గౌస్‌బాషా, ఇమ్మానియల్, టివి.రంగాచార్యులను మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో సాదరంగా ఆహ్వానించిన సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థులు, అధ్యాపకులు వారిని ఘనంగా పూలమాలలతో, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మంచి గురువు దగ్గర విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, ఇందుకు నిదర్శనం ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు కలెక్టర్లుగాను, పోలీసు ఉన్నతాధికారులుగాను, విదేశాలలో సైతం స్థిరపడి ఉన్నారన్నారు. ప్రభుత్వంచే సత్కరించబడ్డ ఈ గురువులను ఇంత ఆలస్యంగా సత్కరించుకోవడం బాధాకరమని, కొన్ని అనివార్యకారణాలవల్ల ఆలస్యానికి చింతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నదాత మణి, మాలకొండారెడ్డి, యానాదిరెడ్డి, పద్మనాభరెడ్డి, సుబ్బారెడ్డి, అనుమాలశెట్టి శివ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## • కవితల పోటీకి ఆహ్వానం

# 'ఉగ్రవాదంపై ఉగ్రనేత్రం తెరవండి'

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యానికి ప్రోత్సాహకరంగా, భారత ప్రజల్లో ఐకమత్యాన్ని, ప్రపంచ శాంతిని చాటిచెబుతూ కవులు, స్కూళ్లు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల నుండి కవితలను ఆహ్వానించి పోటీని నిర్వహిస్తున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చిన్ని నారాయణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని, కళాశాల విద్యార్థులతో పాటు నెల్లూరు జిల్లా కవులందరూ ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కవితలు 25లైన్లకు మించి వుండరాదన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన అత్యుత్తమ కవిత్వాన్నంతా ఒక సంకలనంగా తెచ్చి నెల్లూరీయులకు కానుకగా అందజేయడం జరుగుతుందన్నారు. 'ఉగ్రవాదం-ప్రపంచ శాంతి' అనే అంశంపై విద్యార్థినీ, విద్యార్థులు, కవులు తమ తమ కవితలను చిన్ని నారాయణరావు, రూమ్ నెం.14, 2వ అంతస్తు, కెపిసి ప్లాజా, ఆర్.ఆర్.స్ట్రీట్, నెల్లూరు-1 చిరునామాకు పంపుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 94402 02942 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# 11న జయప్రకాష్ నారాయణ్ జయంతి

ప్రముఖ సోషలిస్ట్ నాయకుడు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ 115వ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేది సాయంత్రం 6 గంటలకు నెల్లూరులోని ఆదిత్య కళాశాల కళాప్రాంగణంలో నిర్వహిస్తామని జెపి సేవాసమితి కన్వీనర్ తుంగా పాండు రంగారెడ్డి తెలిపారు. ఈ సభకు జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు ముఖ్యఅతిథిగా, మంత్రి ఓఎస్‌డి చల్లా పెంచలరెడ్డి ముఖ్యఅతిథిగా, జడ్పీసిఇఒ బి.రామిరెడ్డి ఆత్మీయ అతిథిగా, ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త వివి రాజు ప్రత్యేక అతిథిగా విచ్చేస్తారని, ఆచార్య ఆదిత్య అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

# దోమల నివారణపై ప్రజల్లో అవగాహన

### డిఎంఅండ్‌హెచ్ఓ వరసుందరం

దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్యసిబ్బంది కృషి చేయాలని, దోమల ద్వారా ప్రబలే డెంగీ, మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు, దోమలపై దండయాత్ర కార్యక్రమానికి ప్రభుత్వ సిబ్బందితో పాటు ప్రైవేట్ మెడికల్ సిబ్బంది కూడా సహకరించాలని డిఎంహెచ్ఓ వరసుందరం కోరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నారాయణ మెడికల్ కళాశాల, ఇతర నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటింటికి వెళ్ళి దోమల వల్ల వచ్చే వ్యాధులను, వాటి నివారణ మార్గాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన వైద్యసిబ్బందికి సూచించారు. ప్రతి నెలా మొదటివారంలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యశాఖ సిబ్బంది సమావేశమై వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించుకున్నారు.

# స్వామి దయానంద సరస్వతి స్మారక సభ

ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాల్ ఆవరణంలోని దక్షిణం బ్లాక్ నందు పరమపూజ్య స్వామి దయానంద సరస్వతి వారి స్మారక సభను నిర్వహిస్తున్నట్లు వారి శిష్యులు తెలియజేశారు. ఈ సభలో పూజ్యశ్రీ శ్రీ ప్రణవాత్మానంద సర్వసతి మహారాజ్ పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారు. ఈయన స్వామిదయానంద సరస్వతి మహారాజ్ వద్ద మూడు సంవత్సరాల పాటూ ముంబయిలో శిక్షణ పొందారు. తెలుగునాట అంతటా కూడా బ్రహ్మ విద్యను గురించి ఉపన్యసించారు. వీరితో పాటు కవి, రచయిత మరియు వారి శిష్యుడైన శారదాకుమార్ కూడా ప్రసంగిస్తారు.

## పరిశ్రమలకు అనువైన

# భూములు గుర్తించండి

### - అధికారులను ఆదేశించిన జేసీ ఇంతియాజ్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం, మౌలిక సదుపాయాలతో వున్న భూములున్నాయని, అందువల్ల పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు భూములు కేటాయిస్తామన్నారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరా, భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు మంజూరు చేసేవిషయంలో అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కోర్టులో వున్న కేసులను త్వరగా పరిష్కరించి క్లియరెన్స్ తీసుకునేందుకు కృషి చేయాలని అన్నారు. పరిశ్రమలకు సంబంధించి సబ్సిడీ మంజూరుచేయడంలో బ్యాంక్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో పరిశ్రమల జి.ఎం ప్రదీప్‌కుమార్, జడ్పీ సిఇఒ రామిరెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, ఎఫ్‌సిఐ మేనేజర్ గఫూర్, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీతో

# నూతన పరికరాలు

2010-11సంవత్సరానికి ముందుగా బిందు సేద్యం, తుంపర సేద్యం పథకాల క్రింద నెల్లూరు ఏపియంఐపి ద్వారా లబ్ది పొందిన రైతులు వారి యొక్క పొలంలో గల పని చేయని సూక్ష్మ సేద్య పరికరాలను 50శాతం సబ్సిడీ మొత్తంతో సంబంధిత సూక్ష్మసేద్య కంపెనీల ద్వారా నూతన పరికరాలు వేయించుకొనేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అవకాశం కల్పించిందని నెల్లూరు ఏపియంఐపి పి.డి కె.వి.రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.




ఈ నెల 6వ తేదీ గూడూరులో రాష్ట్ర స్థాయి 3వ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న నెల్లూరుజిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎస్పీ శ్రీనివాస్, కనుమూరు హరిచంద్రారెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అన్నం

రాష్ట్ర కల్లుగీత కార్మికుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అన్నం దయాకర్ గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ఈయన నెల్లూరుజిల్లా గౌడ సంక్షేమ సంఘంలో పని చేశారు. ప్రస్తుతం తెలుగుదేశంపార్టీ బిసి సెల్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

# ఇం'ధనం' కరువు

(మొదటి పేజీ తరువాయి)

ఓడిపోయి ఉంటారు. పార్టీ అధికారంలోకి వచ్చుంటే అభ్యర్థుల పరిస్థితి కొంతన్నా మెరుగ్గా వుండేది. కాని ప్రతిపక్షంలో వున్నారు. రూపాయి ఆదాయం లేదు. 2014 ఎన్నికల్లోనే ఉన్నదంతా ఊడ్చి పెట్టారు. కొందరైతే అప్పులు కూడా చేశారు. పార్టీలో ఎమ్మెల్యేలు అంతా కొత్తోళ్లే! పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లు తక్కువ. ఎలక్షన్ వచ్చిందంటే డబ్బులకు వెంపర్లాడాలి.

ఎన్నికల్లో మిగతా అంశాలన్నీ ఒకెత్తయితే డబ్బు మరో ఎత్తు. 2019 ఎన్నికలను కేవలం డబ్బు ద్వారానే ఎదుర్కోవడానికి చంద్రబాబు సిద్ధమవుతున్నాడు. ఇప్పుడు పార్టీ ఆర్థిక పరిపుష్టితో ఉంది. రాష్ట్రంలో 175అసెంబ్లీలలో అభ్యర్థులకు పార్టీయే ఖర్చు పెట్టగల స్థితిలో వుంది. ఒకవేళ నియోజకవర్గాలు పెరిగినా ఇబ్బంది లేనంతగా ప్లానింగ్ చేస్తున్నారు. అదీగాక తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు కూడా అన్నివైపుల నుండి సంపాదిస్తూ ఆర్థికంగా గట్టిగా నిలబడి వున్నారు.

వైకాపా పరిస్థితే అర్థంకాకుండా వుంది. జగన్ మీద లక్ష కోట్ల సంపాదన అని నింద వేసారుగాని, అక్కడంత సీన్ లేదు. కొన్ని ఆస్తులు ఈడి అటాచ్‌మెంట్‌లో వున్నాయి. ఆయన సొంతంగా డబ్బు తెచ్చే పరిస్థితి లేదు. పార్టీ నిధులు అంతంత మాత్రంగానే వున్నాయి. చంద్రబాబుకు సొంత సామాజిక వర్గం ఆర్థిక సహకారం అందించినట్లు జగన్‌కు సొంత సామాజికవర్గం అందించదు. ఇక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జ్‌లకు సంపాదన లేదు. ఆర్థికంగా సమస్యల్లో వున్నారు. గత ఎన్నికల్లో పెట్టిన ఖర్చుకే చాలామంది కోలుకోలేకున్నారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ వాళ్లు నియోజకవర్గానికి 15 నుండి 20 కోట్లు దాకా ఖర్చు పెట్టొచ్చని అంచనా! మరి ఆ స్థాయిలో మోటుకునే శక్తి వైకాపాకు ఉందా? అన్నది పెద్ద ప్రశ్న? రాష్ట్రంలో ఇతర రాజకీయ పరిస్థితులన్నీ కూడా వైకాపాకు అనుకూలంగానే వున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు వై.యస్ అభిమానం కనిపిస్తుంది. ప్రభుత్వ అవినీతి ప్రజల్లో విరక్తి పుట్టిస్తోంది. కాని డబ్బు ప్రభావం ముందు ఇవన్నీ కనుమరుగైతే వైకాపాకు ఇబ్బందే!

# మంత్రి మొనగాడే!

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమణలకు గురై ఉండడంతో, ఆ కాలువల్లో వరద ప్రవాహం పోయే వీలు లేక రోడ్ల మీదకు, కాలనీలలోకి నీళ్లొచ్చాయి. కొన్ని చోట్ల రోడ్లు తెగిపోయాయి. కొన్ని కాలనీలైతే నాలుగైదు రోజులు జల దిగ్బంధంలో ఉండిపోయాయి. అప్పుడు నెల్లూరొచ్చిన సీఎం చంద్రబాబు రెండ్రోజులు ఇక్కడే వుండి పరిస్థితిని పర్యవేక్షించారు. ఇంతటి వరదలకు కాలువల ఆక్రమణలే కారణమని గుర్తించిన ఆయన, వెంటనే వాటిని తొలగించాలని మున్సిపల్ మంత్రి నారాయణ, ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్దా రాఘవరావులకు బాధ్యత అప్పగించారు. ఒకట్రెండురోజుల్లో ఆక్రమణలు పూర్తి చేసేటట్లు మంత్రి నారాయణ కృష్ణపట్నం పోర్టులో వున్న అన్ని మిషన్‌లను తెప్పించాడు. బయట ప్రాంతాల నుండి కూడా మిషనరీని, సర్వేయర్‌లను దించారు. ఆక్రమణలకు మార్కింగ్ కూడా ఇచ్చారు.

ఈ సమయంలోనే కథ అడ్డం తిరిగింది. వైకాపా ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు రంగంలోకి దిగారు. ఉన్నఫళంగా ఆక్రమణలు తొలగిస్తే 5వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, వారికి నీడ, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రిని కూడా పంటకాలువను ఆక్రమించుకుని కట్టారని, నెల్లూరులో ఆక్రమణల తొలగింపు ఇక్కడ నుండే మొదలు పెట్టాలని పేచీ పెట్టారు. దీంతో మంత్రి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. తన వేలితో తన కన్ను పొడుచుకునే పరిస్థితి వచ్చేసరికి ఆక్రమణల తొలగింపు విషయాన్నే పూర్తిగా పక్కనపెట్టేసారు.

మళ్లీ హైదరాబాద్ వరదల దెబ్బకు నెల్లూరు విషయం గుర్తొచ్చింది. చంద్రబాబు నెల్లూరు ఆక్రమణల తొలగింపును సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గ పరిధిలో 14పంట కాలువలపై 4971 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వీటిలో వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లు కూడా వున్నాయి. ముఖ్యంగా గచ్చుకాలువ, జాఫర్‌సాహెబ్ కాలువ, మన్సూర్‌నగర్ కాలువ, రామిరెడ్డి కాలువ, సర్వేపల్లి కాలువలపై ఆక్రమణలు భారీగా వున్నాయి. ఈ ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెలలోనే ఈ ఆక్రమణల తొలగింపుకు అయిపోవాలి. లేదంటే నవంబర్ మనకు వర్షాల సీజన్. మళ్లీ గత ఏడాదిలాగే వరదలు ముంచెత్తితే ముఖ్యమంత్రి, మంత్రి నారాయణ పరువు గచ్చుకాలువలో కలుస్తుంది.

# భయపెడుతున్న మున్సి'పల్స్'

(మొదటి పేజీ తరువాయి)

కళ్లు బైర్లు కమ్మే విషయాలు బయట పడ్డాయి. తెలుగుదేశంకు కంచుకోట అంటున్న గుంటూరు, కాకినాడ కార్పొరేషన్ లలోనే తెలుగుదేశం పార్టీ గెలిచే పరిస్థితి లేదని ఆ సర్వే బయటపెట్టింది. విశాఖ కార్పొరేషన్‌లో సైతం తెలుగుదేశం పరిస్థితి ఆశాజనకంగా లేదని, చాలా పురపాలక సంఘాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని ఆ సర్వేలో తేలింది. రాష్ట్రంలోని 175 అసెంబ్లీలకు గాను కేవలం 58 స్థానాల్లో మాత్రమే తెలుగుదేశం తిరిగి గెలవగలిగే పరిస్థితి వుందని ఆ సర్వేలో వెల్లడి కావడంతో బాబుకు భయం పట్టుకుంది. అందుకే త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలను జాగ్రత్తగా ఎదుర్కోవాలని భావిస్తున్నాడు. మున్సిపల్ ఎన్నికల్లో ఏ మాత్రం ఎదురుదెబ్బ తగిలినా తెలుగుదేశం పతనానికి అది ఆరంభమవుతుంది.

అయితే అధికారంలో వున్న పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో నెగ్గుకురావడం పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటికి రెండున్నరేళ్లే గడిచాయి. సాధారణ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల గడువు వుంది. కాబట్టి స్థానిక ఎన్నికల్లో ప్రజల ఓట్లు ఎంత ప్రభావం చూపుతాయో, అధికారం కూడా అంతే ప్రభావం చూపుతుంది. అదీకాకుండా ఇవి ప్రత్యక్ష ఎన్నికలు కావు. పరోక్షంగా మేయర్, ఛైర్మెన్‌లను ఎన్నుకుంటారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా కౌన్సిల్‌లో ఓటర్లే! కాబట్టి అధికారపార్టీకి నాలుగైదు సీట్లు తగ్గినా అదనపు సభ్యుల బలంతోనూ, లేదా ప్రతిపక్ష సభ్యులను కొనుగోలు చేయడం ద్వారానూ తమ పార్టీ వారిని మేయర్‌లు, ఛైర్మెన్‌లను చేయడం పెద్ద సమస్య కాదు. అయితే ఓటింగ్ ట్రెండ్‌ను బట్టి ఏ పార్టీ బలహీన పడుతుంది, ఏ పార్టీ బలపడుతుందని అంచనా వేయొచ్చు. ప్రజలు గుత్తసొత్తుగా ఓట్లేసేంత గొప్ప పనులేవీ చంద్రబాబు చేయలేదు. ఇంతవరకు తనకు, తన పార్టీవారికి పని కొచ్చే పనులే చేసుకున్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి శూన్యంగాను, అవినీతి ఘనంగానూ వుంది. అధికార పార్టీ ఎమ్మెల్యేల ధనదాహం హద్దులు దాటింది. వీరి ధాటికి కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు ఈ రాష్ట్రానికి రావాలంటే భయపడుతున్నారు.

చంద్రబాబు పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్న విషయం ఆయన చేయించుకున్న సర్వేలోనే తేటతెల్లమైంది. పరిస్థితి ఇలాగే ఉంటే, అవినీతి ఇలాగే రాజ్యమేలుతుంటే చంద్రబాబు పై ప్రజల్లో విరక్తి పెరగడమేకాని తగ్గడం వుండదు.

## ప్రణిత చేతుల మీదుగా...

# కళానికేతన్ పునఃప్రారంభం





వస్త్ర ప్రపంచంలో దేశ వ్యాప్తంగా తమదైన ముద్ర వేసుకుని వస్త్రాభిమానుల ఆదరాభిమానాలు పొందిన సంస్థ కళానికేతన్. నెల్లూరు, గాంధీనగర్‌లో సరికొత్త మెరుగులు దిద్ది ఆకర్షణీయంగా రూపొందించిన కళానికేతన్ షోరూమ్‌ను ఈ నెల 1వ తేదీన సినీ హీరోయిన్ ప్రణిత పునఃప్రారంభించారు. షోరూమ్‌లో ప్రతి విభాగాన్ని ఆమె పరిశీలించారు. ఆరేళ్ల క్రితం నెల్లూరులో ఏర్పాటు చేయబడ్డ ఈ సంస్థ అతితక్కువ కాలంలోనే ఇక్కడ ఒక బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకుందన్నారు ప్రణిత. మహిళలకు, పురుషులకు, పిల్లలకు, పెద్దలకు... ఇలా అన్ని వయస్సుల వారికి విడివిడిగా కాకుండా ఒకేచోట వస్త్రాలు లభించేలా చేయడం ఈ సంస్థ ప్రత్యేకతగా ఆమె కొనియాడారు. సినీ హీరోయిన్ ప్రణితను చూడ్డానికి, అలాగే ఆధునికంగా రూపొందించబడ్డ షోరూమ్‌ను తిలకించడానికి పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చారు.

గతంలో పురుషులకు, మహిళలకు మాత్రమే ఆధునిక వస్త్రాలను అందిస్తున్న కళానికేతన్, ఇప్పుడు చిన్నారుల కోసం ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించింది. అన్ని వయస్సుల వారు ఈ అధునాతన వస్త్ర ప్రపంచాన్ని సందర్శించి, తమ అభిరుచులకు అనుగుణమైన వస్త్రాలను ధరించవలసిందిగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.నాగభూషణం స్వాగతించారు.

# అంబులెన్సు కూడా లేని పెద్దాసుపత్రి



రాష్ట్రమంత్రిగా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి డాక్టర్ నారాయణ కనీసం నెల్లూరు సమస్యలను కూడా సక్రమంగా పట్టించుకోవడంలేదనే విమర్శలు కోకొల్లలు. నారాయణ వైద్యశాల, నారాయణ విద్యాసంస్థల అధిపతిగా ఆయనకు ఎక్కడలేని పరపతి పలుకుబడి కూడా వున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మంత్రి అయ్యాక నెల్లూరు పంట పండినట్లేనని, ఎంతటి సమస్యలనైనా చిటికెలోనే తీర్చేస్తారనే ఆశపడ్డ జనం కూడా వున్నారు. అయితే, పరిస్థితి అందుకు భిన్నంగా వుండడమే విచారకరం. ముఖ్యంగా నెల్లూరు పెద్దాసుపత్రి సమస్యలతో జబ్బు పట్టి వున్నా, సరైన నిర్వహణ లేక గబ్బుపట్టిపోతున్నా మంత్రిగారు పట్టించుకోకపోవడం దారుణం. పెద్దాసుపత్రి అంటేనే.. అక్కడ రోగులకు కనీస వసతులుండవు. అవసరమైన మందులుండవు.. అందుబాటులో వైద్యులు కూడా వుండరనే ఆరోపణలు నిత్యం వెల్లువెత్తుతూనే వున్నాయి. అయినా, జిల్లాకంతటికీ పెద్దదైన ఈ పెద్దాసుపత్రి బాగును మంత్రి నిర్లక్ష్యం చేయడం చూస్తే రకరకాల విమర్శలు వినవస్తున్నాయి. ఆ ఆసుపత్రిని అలా సమస్యల సుడిలోనే వుంచి, అదే సాకు చూపి.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దృష్టిలో కూడా ఆసుపత్రి పరిస్థితి బాగా లేదనిపించి చివరికి మెడికల్ కళాశాలను రద్దుచేయించవచ్చనే ఆలోచన కూడా ఆయనకు లోలోపల వుండి వుండవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే తన సొంత కళాశాలకు ప్రాధాన్యత ఇచ్చుకోవాలనే క్రమంలో ఆయన పెద్దాసుపత్రిని కావాలనే పట్టించుకోవడం లేదనే ఆరోపణలూ లేకపోలేదు. ఇందుకు ఒక చిన్న ఉదాహరణ.. అంబులెన్స్.

ఎంతో ప్రతిష్టాత్మకమైన నారాయణ వైద్యశాలకు అంబులెన్స్‌ల కొదవ లేదన్నది అందరికీ తెలిసిందే. అంతర్జాతీయస్థాయి శిక్షణ పొందిన ఎమర్జెన్సీ ఫిజిషియన్ల, ఇంటెన్సివిస్టుల పర్యవేక్షణలో ఎమర్జెన్సీ టెక్నీషియన్లు, 40 పడకలతో ఎమర్జెన్సీ కేర్, 200 పడకలతో ఇంటెన్సివ్ యూనిట్ కాంప్లెక్స్ వంటి అత్యంత అధునాతన సౌకర్యాలు నారాయణ హాస్పిటల్స్ ప్రత్యేకతలు. అందువల్ల రోగులకు 'అత్యవసర సమయం ఎప్పుడైనా రావచ్చు' అని, అందుకు తమ అంబులెన్స్‌తో పాటు ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ కూడా సిద్ధంగా వుంటుందని బోర్డులు పెట్టి మరీ ప్రకటించుకుంటున్నారు. మరోవైపు, నెల్లూరు పెద్దాసుపత్రి దుస్థితి మాత్రం దయనీయంగానే వుంటుంది. ఇంత పెద్దాసుపత్రికి కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో లేకపోవడం దారుణం. పెద్దాసుపత్రి అంటేనే పేదలాసుపత్రి. ఈ ప్రభుత్వాసుపత్రికి అవసరమైన అంబులెన్స్ లేకపోవడం ఆ ఆసుపత్రి దుర్గతికి నిదర్శనం. మరి మంత్రిగారికివన్నీ పట్టడం లేదా?.. లేదా కావాలనే పట్టించుకోవడం లేదో తెలియదు. ఇటీవల స్వచ్ఛ భారత్‌పై జిపిఆర్ కళ్యాణమండపంలో దీపా వెంకట్ ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఒకరు.. పెద్దాసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం లేదని, దాతలెవరైనా స్పందించి పేదరోగుల కోసం అంబులెన్స్‌ను ఏర్పాటుచేయాలని కోరడం విడ్డూరం.. విచారకరం కూడా. అయినా, అంత పెద్దాసుపత్రికి ఇప్పటిదాకా కనీసం అత్యవసరమైన అంబులెన్స్ లేకపోవడం ఏమిటో ఎవరికీ అర్థంకాని విషయం. నారాయణ ఆసుపత్రివారు పేర్కొన్నట్లు 'అత్యవసర సమయం ఎప్పుడైనా రావచ్చు'. నిజానికి అలాంటి 'అత్యవసరం' కార్పొరేట్‌స్థాయి రోగులకే కాదు, నిరుపేదలకి కూడా రావచ్చు కదా!..ఈ విషయం ఆలోచించేదెవరు?.. జిల్లా మంత్రిగా వున్న నారాయణ తన బాధ్యతలను విస్మరించి తన స్వంత సంస్థపై వున్న ప్రేమలో ఒక్క శాతం కూడా పెద్దాసుపత్రిపై చూపకుండా పేదప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ప్రభుత్వాసుపత్రిని నిర్లక్ష్యం చేయడమే బాధాకరం. ఇకనైనా మంత్రిగారు పెద్దాసుపత్రి వసతులపై దృష్టిపెట్టి వెంటనే ఆ ఆసుపత్రికి అవసరమైన అంబులెన్స్‌లను, ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లను తక్షణం మంజూరు చేయించడం కనీస కర్తవ్యం. ప్రభుత్వం నిర్వహణలోని పెద్దాసుపత్రిని ఎంత బాగా అభివృద్ధి చేస్తే అంత మంచిది. ప్రతిపక్షాలు ఎంతగా విమర్శించినా, పత్రికల్లో ఎన్నిసార్లు మందలించినా నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న విధానాన్ని విడవండి. ఒక విద్యావేత్తగా వేలకోట్ల రూపాయల విద్యావ్యాపారిగా వున్న మీకు ఈపాటి కనీస బాధ్యత కూడా గుర్తు చెయ్యాల్సి రావడం విచారకరం.

మినీబైపాస్‌రోడ్డులో నారాయణ హాస్పిటల్ వారి హోర్డింగ్...




**అయ్యో!.. మంత్రిగారూ!.. అత్యవసరం పేదోడికీ రావచ్చు**





## రంగడి ఆస్తులు స్వాధీనానికి

# రంగం సిద్ధం!

నెల్లూరు నగరం ఏ.సి సెంటర్‌లోని కోట్లాది రూపాయల విలువచేసే శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంకు చెందిన స్థలాన్ని తిరిగి దేవస్థానం స్వాధీన పరిచేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 5వ తేదీతో ఈ స్థలానికి సంబంధించిన లీజు గడువు ముగిసింది. లీజును తిరిగి పునరుద్ధరించుకునేందుకు లీజుదారులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. రంగనాథస్వామికి చెందిన ఆస్తులు కావడంతో సెంటిమెంట్ అడ్డొచ్చి అధికారపార్టీ నాయకులు ఈ విషయంలో వేలు పెట్టలేదు.

వివరాల్లోకి వెళితే అయితా చెంచురామశెట్టి అనే దాత రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు, సర్వేనెంబర్ 1516, 1517లలో ఏడు ఎకరాల భూమిని దేవస్థానంకు దానపత్రం క్రింద ఇచ్చారు. దీనికి సంబంధించి 1894 సెప్టెంబర్ 28న నెల్లూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నెంబర్ 2503గా రిజిష్టర్ అయ్యింది. 1917లో గుడి ధర్మకర్త అన్నరంగాచార్యులు ఈ భూమిని శాశ్వత లీజు క్రింద ములుమూడి వెంకటరామయ్య, దేవూరి సుబ్బమ్మలకు ఇచ్చారు. తర్వాతకాలంలో రోడ్లు, ఇతర అవసరం కోసం ప్రభుత్వం ఐదున్నర ఎకరాల భూమిని తీసుకుని 820రూపాయల పరిహారాన్ని దేవస్థానంకు జమ చేసింది. ఈ భూమి పోను 1.43ఎకరాలు మిగలగా అప్పుడు అంకణాల క్రిందకు మార్పుచేసి ఏడాదికి వంద రూపాయలు మక్తా చెల్లించే విధంగా నిర్ణయించారు. ఈ డబ్బును స్వామివారి కైంకర్యాలకు ఖర్చు చేస్తూ వచ్చారు. ఆ తర్వాత అసలు లీజుదారులు పోయి వారి స్థానంలో మరికొందరు లీజుదారులు వచ్చారు. ఆ తర్వాత కమర్షియల్ భవనాలు వచ్చాయి. స్వామికి చెల్లించేది గోరంత, వీరు అనుభవించేది కొండంత. 1987లో వచ్చిన దేవాదాయ శాఖ చట్ట సవరణ ప్రకారం లీజు గడువు ముగిసినా, సక్రమంగా లీజులు చెల్లించకపోయినా వారిని ఆక్రమణదారులుగా గుర్తించి ఖాళీ చేయించవచ్చు. ఈ చట్ట సవరణ ఆధారంగా 1997లో దేవాదాయ శాఖ అధికారులు సర్వే జరిపి లీజుదారుల వారసులుగా చెప్పుకుంటూ అనుభవిస్తున్నవారికి స్థలాలను ఖాళీ చేయాలంటూ నోటీసులు పంపారు. దీనిపై లీజుదారులు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుని అక్కడే కొనసాగుతున్నారు. ఇప్పుడు 99ఏళ్ల లీజు గడువు కూడా ముగియడంతో 63మంది లీజుదారులను గుర్తించి వారిలో 43మందికి స్థలాలను ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేశారు. లీజుదారులు కోర్టుకెళ్లి స్టే తెచ్చుకోకుండా దేవాదాయశాఖ అధికారులు ముందుగానే కోర్టులో కెవియట్ దాఖలు చేశారు.

లీజుదారులు మళ్ళీ కోర్టుకు వెళ్లినా, హైకోర్టు కూడా ముందు షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వాలని లీజుదారులను ఆదేశించింది. ఆ స్థలాలను రంగనాథస్వామి దేవస్థానం ఆస్తులుగానే పరిగణిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. దీంతో ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధమైంది. ప్రస్తుతం దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ విజయదశమి ఉత్సవాల నిర్వహణలో బిజీగా వున్నారు. దసరా తర్వాత ఈ వివాదంపై ఆమె దృష్టి సారించే అవకాశముంది.

## స్వాధీనం చేసుకుంటాం - ఇఓ

దేవాదాయశాఖ ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే ఈ స్థలాలను స్వాధీనం చేసుకుంటామని ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆస్తులు స్వాధీనపరచకుండా తమపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, ఏ నాయకుడు కూడా తమపై ఒత్తిడి తేవడం లేదని, చట్ట నిబంధనల ప్రకారమే వ్యవహరించి న్యాయబద్ధంగా దేవస్థానానికి సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకుంటామన్నారు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com